

హైదరాబాద్ వార్త

# వర్గీకరణ చేపట్టాలని అర్ధనగ్న ప్రదర్శన



అర్ధనగ్న ప్రదర్శనలో మాట్లాడుతున్న చింతల రాజలింగం

**సైఫాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త :** తాము అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని ప్రకటించిన ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ పలు మాదిగ ఉప సంఘాల నేతలు గురువారం ట్యాంక్‌బండ్ వద్దగల అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఎస్సీ ఉప కులాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చింతల రాజలింగం, మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న తదితరులు మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు పెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మునుగోడు ఉప ఎన్నికల్లో బిజెపిని ఓడిస్తామని హెచ్చరించారు. సిఎం కెసిఆర్ వర్గీకరణ కోసం అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్రానికి నివేదిక పంపి సంవత్సరాలు గడిచినా కేంద్రం వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించకుండా కాలయాపన చేసిందని వారు ధ్వజమెత్తారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని పదేపదే ప్రకటించి ప్రస్తుతం మౌనంగా ఉన్నారని ఆరోపించారు. మునుగోడు నియోజకవర్గంలో మాదగ, ఉప కులాలకు సంబంధించిన 36 వేల మంది ఓటర్లు వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో పెట్టకపోతే బిజెపి అభ్యర్థి కార్యక్రమాలను అడుగడుగున అడ్డుకుంటామని హెచ్చరించారు.

# తిరంగా.. మురుపెంగా

## - ఉత్సాహంగా సాగిన ఫ్రీడమ్ రన్



ఓయూ నుండి ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా వరకు జరిగిన 2కే ఫ్రీడమ్ రన్‌లో పాల్గొన్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తదితరులు

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త :** 75ఏళ్ల స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని నగరంలో వజ్రోత్సవాలు అట్టహాసంగా సాగుతున్నాయి. ఈ నెల 8న ప్రారంభమైన ఈ వేడుకల్లో భాగంగా ప్రభుత్వం రోజుకో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. స్వాతంత్ర్యసమరయోధులను స్మరించుకుంటూ స్వరాజ్య స్ఫూర్తిని నేటి తరాలకు చాటిచెప్పేలా సాగుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా నగరంలో నిర్వహించిన ఫ్రీడమ్ రన్ ఉత్సహంగా సాగింది. ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు ఈ పరుగులో పాల్గొని జాతీయతా భావాన్ని చాటిచెప్పారు. బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ కేంద్రం వద్ద నుంచి చేపట్టిన 5కే రన్‌ను హోంమంత్రి మహమూద్ ఆలీ జెండా ఊపి ప్రారంభించారు. కేబీఆర్ పార్కు నుంచి ప్రారంభమైన ఈ పరుగులో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, సీఎస్ సోమేశ్‌కుమార్, జిహెచ్‌ఎంసి కమిషనర్ లోకేశ్‌కుమార్, సీపీ సీవీ ఆనంద్, పోలీసులు, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ చౌరస్తా నుంచి ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా వరకు ఫ్రీడమ్ 2కే రన్‌ను నిర్వహించారు. ఈ రన్‌లో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్లు ఇ.విజయ్ కుమార్‌గౌడ్, బి.పద్మ వెంకటరెడ్డి, కాచిగూడ ఎసిపి ఆకుల శ్రీనివాస్, ఏఎంఒహెచ్ జ్యోతిబాయి, డిపివోరజిత, టౌన్ ప్లానింగ్ ఏసిపి సాయిబాబా, డిప్యూటీ ఇఇ సువర్ణ, సుధాకర్, ఎఇలు ప్రేరణ, విఘ్నేశ్వరీ, దివ్యతేజ, టిఆర్ ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రబోలు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. సరూర్‌నగర్ స్టేడియంలో జరిగిన ఫ్రీడమ్ రన్‌లో మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఇలా తీసుకుంటున్నారు...అలా ఆమ్మేస్తున్నారు

**బ్లాక్ మార్కెట్ బాటపడుతున్న రేషన్ బియ్యం**
**కేజీ రూ.10 నుంచి రూ.20కి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు**
**శివారు కాలనీలు, బస్తీల్లో బహిరంగంగానే ఆటోలు పెట్టిమరీ కొంటున్న వైనం**



**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త :** పేదలకు ఆకలి తీర్చాల్సిన రూపాయి బియ్యం నల్లబజార్‌బాట పడుతుంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పథకం అధికారుల నిర్లక్ష్యంతో పక్కదారి పడుతున్నాయి. పేదలకు కడుపునిండా అన్నం ఈబియ్యాన్ని కొంతమంది అక్రమార్కులు అధిక ధరలకు అమ్ముకుని జేబులు నింపుకుంటున్నారు. కొంతమంది లబ్దిదారులు రూ.10కిపైగా అమ్మకానికి పెట్టి పథకానికి తూట్లు పొడుస్తునానరు. ఇతర జిల్లాలకు చెందిన కొంమంది బస్తీలు,కాలనీల్లో తిరుగుతూ లబ్దిదారులు కాలనీల్లో తిరుగుతూ లబ్ధిదారులకు ఆశలు కల్పించి రెట్టింపు ధరలో కొనుగోలు చేస్తున్నారు. ఈదందా మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతున్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్స్ (ఈపాస్) యంత్రాలు, ఆధార్ సంఖ్య సాయంతో నిబంధలకు విరుద్ధంగా ఆహార భద్రత కార్డులు దక్కించుకున్న అనర్హులను తొలగించారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా సుమారు లక్షకు పైగా ఆహార భద్రతకార్డులను రద్దుచేశారు. అయినా సరే ప్రతినెల 30శాతానికిపైగా కోటా చౌకధరల దుకాణాల్లో మిగిలిపోవడాన్ని అధికారులు గుర్తించారు. ఎందుకీ పరిస్థితి అంటూ ఆరా తీస్తే అసలు సంగతి బయటపడింది. లక్షలాది మంది కార్డుదారులు అసలు రేషన్ సరుకులు తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదు. ఫీజు రియంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసమే కార్డును తీసుకుంటున్నట్లుగా గుర్తించారు. ఆలోపే ఆహార భద్రతాకార్డు కేవలం రేషన్ కోసం మాత్రమేనంటూ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇంకే ముంది వరుసగా మూడునెలల పాటు ఎవరెవరు సరుకులు తీసుకోలేదో జాబితాను బయటకు తీసారు. ఒకేసారి సుమారు లక్షకార్డులు రద్దుచేశారు. దీంతో సరుకులు తీసుకోకపోతే రేషన్‌కార్డు రద్దు చేస్తుండటంతో లబ్దిదారులు అప్రమత్తం అయ్యారు. తమకు అవసరమున్నా..లేకపోయినా సరే ఈపాస్ యంత్రాల్లో వేలి ముద్రలు వేసి మరి రేషన్ సరుకులను తీసుకుంటున్నారు. కొందరేమో డీలర్లకే రూపాయి బియ్యాన్ని కిలోకు రూ.5నుంచి 10చొప్పున విక్రయిస్తున్నారు. మరికొందరేమో సమీప ప్రాంతాల్లోని బియ్యం దుకాణాలు, కిరాణాషాపుల్లో విక్రయిస్తున్నారు. వాళ్లేమే అదను చూపి నల్లబజార్ బాటపట్టిస్తున్నారు. పేదల ఆకలి తీర్చాల్సిన రూపాయి బియ్యం రీసైక్లింగ్ చేసేందుకు రైస్ మిల్లులకు తరలివెళ్తున్నట్లు పలువురు తెలుపుతున్నారు. చాలా మంది కార్డుదారులు తమకు అవసరం లేకపోయినా ఇప్పటికీ సరుకులు తీసుకుంటున్నారు. రేషన్ బియ్యం అమ్మినా..కొనుగోలు చేసినా నేరమని తెలియక చాలా మంది అమ్ముకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్డుదారులకు అవగాహ కల్పించాల్సి అవసరముందని పలువురు తెలుపుతున్నారు.

# దేశానికి స్వాతంత్ర్యం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయే

## - టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్‌యాదవ్



కార్యక్రమంలో పాల్గొన్న అంజన్‌కుమార్‌యాదవ్

**చిక్కడపల్లి, ఆగస్టు 11, ప్రభాతవార్త :** ఆనాడు దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది, నేడు తెలంగాణ రాష్ట్రం ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపి ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. ఎఐసిసి ఇచ్చిన పిలుపులో భాగంగా 'ఆజాదీకీ గౌరవ్‌యాత్ర' కార్యక్రమాన్ని ముషీరాబాద్ నియోజకవర్గంలో రామ్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహ్మద్ జోహెర్ హుస్సేన్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీని అంజన్‌కుమార్‌యాదవ్ ప్రారంభించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పాశం అనీల్‌కుమార్ యాదవ్, మాజీకార్పొరేటర్‌లు కల్పనాయాదవ్, వాజీద్ హుస్సేన్, సీనియర్ కాంగ్రెస్ నేతలు రుషికేశ్, జిఎన్.కేశవ్, కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు విడి.కృష్ణ, బి బ్లాక్ అధ్యక్షుడు అంజియాదవ్, అడిక్‌మెట్ అధ్యక్షుడు నాగేందర్, తిరుమల్, మేడి సురేశ్, గుర్రం శంకర్, ఆర్.ప్రవీణ్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వరలక్ష్మి, ఆవుల లోకేష్‌యాదవ్, పుస్తకాల కవిత తదితరులతో పాటు వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆటోలో తరలిస్తున్న 30 కిలోల గంజాయి స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

**హాయత్‌నగర్, ఆగస్టు 11, ప్రభాతవార్త :** ఆంధ్రలోని ఎజెన్సీ ప్రాంతం నుంచి నగరానికి గంజాయి రవాణా చేస్తున్న పాత నేరస్తులను హాయత్‌నగర్ పోలీసులు అరెస్టుచేసి వారినుంచి 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు... విశాఖపట్నం జిల్లా అనాకాపల్లి మండలం కొత్తకోటకు చెందిన చెల్లూరి నాగవెంకట కృష్ణవేణి అలియాస్ శ్రీదేవి నగరంలోని ఫిల్మ్‌నగర్‌లో నివాసముంటోంది. ఆమె నాలుగేళ్లుగా గంజాయిని అక్రమంగా ఎజెన్సీ ప్రాంతం నుంచి నగరానికి తరలిస్తూ శరత్ అనే వ్యక్తిద్వారా విక్రయాలు కొనసాగిస్తోంది. నాచారం, బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఆమెపై గంజా తరలింపు కేసులు నమోదయ్యాయి. జైలుకు సైతం వెళ్లి బెయిలుపై బయటకు వచ్చింది. అయినా గంజా రవాణా విక్రయాలను కొనసాగిస్తూనే ఉంది. విశాఖపట్నం ప్రాంతానికి చెందిన భాస్కర్ నుంచి కిలో గంజాయిని 3 వేల రూపాయలను కొనుగోలు చేసి నగరంలోని శరత్, అర్జున్‌లకు 20వేలకు విక్రయిస్తోంది. ఈక్రమంలో నెలక్రితం స్వగ్రామానికి వెళ్లిన ఆమె గంజాయిని విశాఖప్నం నుంచి నగరానికి తరలించి నగరంలోని అర్జున్‌కు అందించేందుకు ఫిలింనగర్‌లో నివసించే అద్దూరి అమ్ములు, మహేష్, శ్రీనివాస్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. దీనికోసం వారికి 50 వేలను ఇస్తానని చెప్పింది. ఈమేరకు శ్రీదేవి పైన పేర్కొన్న వారితో కలిసి ఈనెల 10న ఆటోలో విశాఖపట్నం నుంచి నగరానికి గంజాయితో వస్తుండగా... విశ్వసనీయ సమాచారం మేరకు హాయత్‌నగర్ పోలీసులు పెద్దఅంబర్‌పేట చౌరస్తాలో ఆటోను ఆపి తనిఖీ చేశారు. ఆటోతో పాటు అందులో ఉన్న 30 కిలోల గంజాయిని, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు.



పోలీస్ కమాండ్ కంట్రోల్ నుంచి చేపట్టిన 5కే ఫ్రీడమ్ రన్‌లో పాల్గొన్న మంత్రులు మహమూద్‌అలీ, తలసాని, ఎమ్మెల్యే దానం నాగేందర్, సీఎస్ సోమేశ్‌కుమార్, జిహెచ్‌ఎంసి కమిషనర్ లోకేశ్‌కుమార్, సీపీ సీవీ ఆనంద్

# నేడే రక్షాబంధన్

## నాకు నువ్వురక్ష...నీకు నేనురక్ష-అన్నాచెల్లెళ్ళు, అక్కాతమ్ముళ్ళు ఆత్మీయంగా జరుపుకునే పండుగ



**హైదరాబాద్, ఆగస్ట్ 11, ప్రభాతవార్త :** రాఖీ, రక్షాబంధన్, లేదా రాఖీ పౌర్ణమి అని పిలిచే ఈ పండుగను కొన్ని ప్రాంతాల్లో 'శ్రావణపౌర్ణమి' లేదా 'జంద్యాలపౌర్ణమి' అనికూడా పిలుస్తారు. అన్నాచెల్లెళ్ళు, అక్కాతమ్ముళ్ళ మధ్య ప్రేమానురాగాలకు సూచికగా ఈ పండుగ జరుపుకుంటారు. కొంతకాలం క్రితం వరకు ఉత్తర, పశ్చిమ భారతదేశాలలో ఈ పండుగను చాలా వైభవంగా జరుపుకునేవారు. ఇప్పుడు దేశమంతా జరుపుకుంటున్నారు. అన్నకుగానీ, తమ్ముడుకి గాని ప్రేమసూచికంగా సోదరి కట్టేది రాఖీ. రాఖీ అనగా రక్షణబంధం ఇది అన్నా చెల్లెల్లు, అక్కాతమ్ములు జరుపుకునే మహోత్తరమైన పండుగ, చెల్లి తన అన్నయ్య మహోన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటూ అన్నయ్యకు కట్టేదే ఈ రాఖీ.

**రక్షాబంధన్ ఎలా ప్రారంభమైందంటే :** పూర్వం దేవతలకు, రాక్షసులకు మధ్య పుష్కరకాలం యుద్ధం జరిగింది. యుద్ధంలో ఓడిపోయిన దేవతల రాజు దేవేంద్రుడు నిర్వీర్యుడై, తన పరివారమంతటినీ కూడగట్టుకుని అమరావతిలో తలదాచుకుంటాడు. భర్త నిస్సాహాయతను చూసిన ఇంద్రాణి తరుణోపాయం అలోచిస్తుంది. రాక్షస రాజు అమరావతిని దిగ్బంధనం చేస్తున్నాడని తెలుసుకుని భర్త దేవేంద్రుడుకి సమరం చేయడానికి ఉత్సాహాన్ని కల్పిస్తుంది. సరిగ్గా ఆరోజు రావణపౌర్ణమి కావడంతో పార్వతీ పరమేశ్వరులను, లక్ష్మీ నారాయణులను పూజించి రక్షాను దేవేంద్రుడికి కడుతుంది. అదిగమనించిన దేవతలందరూ వారు పూజించిన రక్షలను తీసుకువచ్చి ఇంద్రుడికి కట్టి పంపుతారు. సమరంలో గెలిచిన ఇంద్రుడు తిరిగి త్రిలోవ ఆధిపత్యాన్ని పొందుతాడు. శచీదేవి ప్రారంభించిన ఆ రక్షాబంధనం..నేడు రాఖీ పండుగగా ఆచారమైందని పురాణాలు చెబుతున్నాయి.

**ద్రౌపది-శ్రీకృష్ణుని బంధం :** ఇతిహాసాల ప్రకారం చూస్తే ద్రౌపది, శ్రీకృష్ణుడికి అన్నాచెల్లెల్ల అనుబంధం అత్యంత గొప్ప అనుభందంగా కనిపిస్తుంది. శివపాలుడిని శిక్షించే క్రమంలో సుదర్శన చక్రాన్ని ప్రయోగించిన కృష్ణునికి చూపుడు వేలుకు రక్తం ధారాలంగా కారుతుండట, అది గమనించిన ద్రౌపది తన పట్టుచీర కొంగు చింపి వేలుకి కట్టడంవల్ల. దానికి కృతజ్ఞతగా ఎల్లవేళలా అండగా ఉంటానని శ్రీ కృష్ణుడు ద్రౌపదికి హామీ ఇస్తాడు, అందుకు ప్రతిగా దుశ్శాసనుడి దురాగతం నుండి ఆమెను కాపాడుతాడు. చరిత్ర పుటల్లో అలెగ్జాండర్ భార్య 'రోక్సానా' తక్షశిల రాజు పురుషోత్తముడిని తన సోదరుడిగా భావించి రాఖీకడుతుంది. జగజ్జేతగా మారాలనే తపనతో గ్రీకు యువరాజు అలెగ్జాండర్ క్రీ.పూ 326 లో భారతదేశంపై దండెత్తుతాడు. ఆ క్రమంలో బాక్ట్రియా (నేటి ఆఫ్ఘనిస్తాన్) కు చెందిన యువరాణి రోక్సానాను వివాహం చేసుకుంటాడు. ఆమె వివాహసంభందాన్ని ఉపయోగించుకొని మధ్య ఆసియా దేశాలను ముఖ్యంగా జీలం, చినాబ్ నదుల మధ్యనున్న రాజ్యాలను జయించాలని అలెగ్జాండర్ యుద్ధం ప్రకటిస్తాడు. పురుషోత్తముడి శత్రురాజు అంబి, అలెగ్జాండర్‌ను భారతదేశంపై దండెత్తమని ఆహ్వానిస్తాడు. అయితే అలెగ్జాండర్ భార్య రోక్సానా పురుషోత్తముడిని తన అన్నలా భావించి రాఖీకడుతుంది. తన సోదరుడిని చంపవద్దని తన భర్త అయిన అలెగ్జాండర్‌ను కోరుతుంది. దీంతో అలెగ్జాండర్ యుద్ధం విరమించుకుంటాడు. ఈ రాఖీ పండుగ నాడు సోదరి రాఖీకట్టిన తర్వాత తలపెట్టే కార్యములు విజయవంతమై, సుఖసంపదలు చేకూరుతాయని విశ్వాసం. అలా రాఖీలు కట్టించుకున్న సోదరులు, తమ సోదరీమణులకు చిరుకానుకలు సమర్పించి అందరూ కలిసి భోజనం చేస్తారు. ఇకపోతే శ్రావణపూర్ణిమ రోజున బ్రాహ్మణులు నూతన జంధ్యాలు ధరిస్తారు. ఈ రోజున బ్రాహ్మణులు నూతన యజ్ఞోపవీతాధారణలు చేసి విద్యార్థులకు వేదపఠనం ప్రారంభిసారు, 'జంధ్యాపూర్ణిమ' అని పిలువబడే ఈ పండుగ కాల క్రమేనా 'రక్షాబంధన్ మరియు రాఖీ' పండుగగా ప్రాచుర్యం పొందింది.

# ప్రగతిభవన్‌ముందు యువకుడు ఆత్మహత్యయత్నం

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త :** ప్రగతిభవన్ ముందు ఓ యువకుడు గురువారం ఆత్మహత్యాయత్నం చేశాడు. సూర్యపేటకు చెందిన రవి అనే యువకుడు ఒక్కసారిగా ప్రగతిభవన్ వద్దకు చేరుకుని బలవన్మరణానికి యత్నించాడు. దీంతోఅక్కడున్న సిబ్బంది షాక్‌గురయ్యారు. వెంటనే రవినిపట్టుకుని పెట్రోల్ డబ్బాను లాక్కుని సర్ది చెప్పారు. అయినా వినకపోవడంతో ఆయన్ను పంజాగుట్ట పోలీసులకు అప్పగించారు. దీంతో కొందిసేపు పంజాగుట్ట సికింద్రాబాద్ రోడ్డు మార్గంలో ట్రాఫిక్ జామ్ అయ్యింది.

# కవిత కుటుంబానికి న్యాయం చేయాలని చీఫ్ వార్డెన్ హాస్టల్ ముందు ఆందోళన



ఓయూ చీఫ్ వార్డెన్ ఆఫీస్ ముందు ఆందోళన చేస్తున్న ఉద్యోగులు, కుటుంబికులు

**తార్నాక, ఆగస్టు 11, ప్రభాతవార్త :** ఓ.యూ మంజీర హాస్టల్‌లో దీర్ఘకాలికంగా కుక్‌గా పనిచేస్తూ పాము కాటుతో మృతి చెందిన కవిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఓ.యూ చీఫ్ వార్డెన్ హాస్టల్ ముందు మృతురాలి సహచర ఉద్యోగులు, కుటుంభ సభ్యులు ఆందోళన చేశారు. వీరికి మద్దతుగా ఐఎఫ్‌టీయూ హైదరాబాద్ జిల్లా, మెడ్చల్ జిల్లా కమిటీ అధ్యక్షురాలు ఎస్ఎల్ పద్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎల్ పద్మ , కౌసర్ మాట్లాడుతూ మృతురాలు కవిత కుటుంబానికి రూ. 25లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఔట్ సోరింగ్స్ వ్యవస్థను రద్దు చేసి కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఉద్యోగులకు మెడికల్ ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాని కోరారు. ఆమె అంత్యక్రియల కోసం నగదు ఇవ్వాలని కోరారు. దీంతో డిమాండ్లపై చీఫ్ వార్డెన్ స్పందించి బాదిత కుటుంబానికి రూ.20వేలు ఇచ్చారు. ఉద్యోగం కల్పిస్తామని, ఎక్స్‌గ్రేషియా విషయం ఓ.యూ ఉన్నతాధికారులతో చర్చిస్తామని చెప్పాడంతో ఆందోళన సద్దు మనిగింది. ఈ కార్యక్రమంలో పి. ముత్యం, ఆర్. శంకర్, అంజాద్ అలి, కౌసర్ బేగ్, భారతి, మురుబాయి, ప్రకాష్, అనసూయ, బి. వెంకటేష్, రహమత్, లలిత,, విజయ, స్వప్నతో పాల్గొన్నారు.

# ఉరి వేసుకొని బాలిక మృతి

**కంటోన్మెంట్, ఆగస్టు 11, ప్రభాతవార్త :** సికింద్రాబాద్ మార్కెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 5వ తరగతి చదువుతున్న ఓ బాలిక ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మార్కెట్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్ రావ్ తెలిపిన వివరాల ప్రకారం టకార బస్తీలో నివాసం ఉంటున్న గణేష్, గీతలకు చెందిన సమిక్ష 10 సంవత్సరాలు 5 తరగతి చదువుతుంది. గురువారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. న్యూ బోయగూడలోని కీర్తి హై స్కూల్‌లో చదువుతున్న ఆ బాలిక వారం రోజుల నుంచి స్కూల్‌కి వెల్లనంటూ మారం చేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్ రావ్ ఆధ్వర్యంలో ఎస్ఐ కనకరాజు దర్యాప్తు చేస్తున్నారు.

# భారతీయ సంస్కృతిని చాటిచెప్పిన రక్షాబంధం పద్యనాటక ప్రదర్శన



రక్షాబంధం పద్యనాటకంలో ఒక దృశ్యం

**నాంపల్లి, ఆగస్టు 11, ప్రభాతవార్త :** ప్రాణంపోయినా ఇచ్చినమాట తప్పకూడదన్న భారతీయ సంస్కృతిని చాటిచెప్పుతూ తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, తెలుగు రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి సంస్థల సౌజన్యంతో 75వ స్వతంత్ర్య భారత వజ్రోత్సవాలు, రాఖీపండుగలను పురస్కరించుకొని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. ఎన్టీఆర్ కళామందిరంలో నవక్రాంతి కల్చరల్ అసోసియేషన్ వారి రక్షాబంధం చారిత్రాత్మక పద్యనాటక ప్రదర్శన నిలిచింది. క్రీ.పూ 4వ శతాబ్ధంలో పాంచాల రాజ్యాన్ని పాలిస్తున్న పురుషోత్తముడు అనే రాజు, అదేకాలం గాంధీర రాజ్యాన్ని పాలిస్తున్న అంభి అనే రాజుకు పురుషోత్తముడిని ప్రజలంతా మెచ్చుకోవడంతో అసూయపుట్టి నాశనం చేయాలనుకొన్నా స్వశక్తిలేక ఆ సమయంలో భారతదేశంపై దండయాత్ర చేస్తున్న అలెగ్జాండర్‌తో చేతులు కలుపుతాడు. అలెగ్జాండర్‌ను ప్రేమిస్తున్న ఇరాన్ రాకుమార్తె రుక్సానా పురుషోత్తముడిపై యుద్ధంచేస్తే చనిపోతాడన్న భయంతో రాఖీపండుగ రోజు పురుషోత్తముడి చేతికి రాఖీ కట్టి యుద్ధంలో అలెగ్జాండర్‌ను చంపనని పురుషోత్తముడు వద్ద మాట తీసుకోవడం, రుక్సానాకు ఇచ్చిన రక్షాబంధం వాగ్దానంతో సులభంగా అలెగ్జాండర్‌ను చంపే అవకాశమొచ్చినా వదిలేసి భారతీయ సంస్కృతిని చాటిచెప్పడం, అందుకు గర్వించిన అలెగ్జాండర్ పురుషోత్తముడుతో స్నేహబంధం ఏర్పరచుకోవడం ఇతివృత్తంగా చిటిప్రోలు కృష్ణమూర్తి రచన, చిటిప్రోలు వెంకటరత్న నాటకీకరణ, ఎం.అర్జున్‌రావు దర్శకత్వం, చిటిప్రోలు జయప్రభ నిర్వహణలో ముఖ్యపాత్రలు పురుషోత్తముడుగా ఎం.అర్జున్‌రావు, అంభిగా పివిఆర్.మూర్తి, అలెగ్జాండర్‌గా ఎం.శ్రీనివాస్, రుక్సానాగా పిజె.రత్నారెడ్డి, తదితరులు ఇతరత్రా పాత్రలు అద్భుతంగా పోషించగా ఈ రక్షాబంధం పద్యనాటకం విచ్చేసిన అసంఖ్యాక ప్రేక్షకులను మైమరపించి మంత్రముగ్ధులను చేసింది. ఈ కార్యక్రమంలో అతిథులు విచ్చేసిన ప్రముఖులు పద్యనాటక ప్రదర్శనలోని కళాకారులతోపాటు రంగస్థల రంగానికి చెందిన ప్రముఖులు వెంకటరత్నం, వై.గంగాధర్, మల్లాదిభాస్కర్, డి.శివాజీ, ఎ.వెంకటేష్, రజనీశ్రీకళను ఘనంగా సత్కరించారు.

# వర్గీకరణకు ఆర్టికల్ 341ని సవరించరాదు

## - ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షుడు జి.చెన్నయ్య



కేంద్ర మంత్రికి వినతి పత్రాన్ని అందజేస్తున్న జి.చెన్నయ్య

**సైఫాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త :** తెలుగు రాష్ట్రాలలో ఎస్సీ వర్గీకరణకు సహకరించవద్దని కేంద్ర సామాజిక న్యాయ సాధికారత శాఖ మంత్రి రాందాస్‌అతెవాల్‌కు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం న్యూఢిల్లీలో ఆనేక మంది మాలలు రాందాస్‌అతెవాల్‌ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. అలాగే ఆయనకు మాల మహిళలు రాఖి పండుగను పురస్కరించుకుని రక్షాబంధన్ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పోరాట సమితి ఛైర్మన్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య మాట్లాడుతూ ఆర్టికల్ 341ని సవరించి తెలుగు రాష్ట్రాలకు అధికారం ఇవ్వరాదని, రాజ్యాంగ స్ఫూర్తిని, సుప్రీంకోర్టు తీర్పును, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని గౌరవించాలని, ఇ.వి.చిన్నయ్య కేసును పునఃసమీక్షించవద్దని కోరారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం తమ పబ్బం గడుపుకోవడానికి ఎస్సీ వర్గీకరణ చిచ్చును బిజెపి పెడుతున్నదని ఆరోపించారు. వర్గీకరణ చిచ్చుతో ఎస్సీలు ఇప్పటికే అన్ని రంగాలలో తీవ్రంగా నష్టపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాలలో ఎస్సీ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్‌ల శాతాన్ని 20 శాతంకు పెంచాలని ఆయన మంత్రికి విజ్ఞప్తి చేశారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారని జి.చెన్నయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి వైస్-ఛైర్మన్‌లు కిషన్, జనార్ధన్, కనకరాజు, రమేష్, ఈశ్వరి, రేణుక, సుమిత్ర, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్తంగా ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌కు భారీ ఏర్పాట్లు
### - రాజ్యసభసభ్యులు, బిజెపి ఓబీసీ సెల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్

**చిక్కడపల్లి, ఆగస్టు 11, ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా ఆజాదీకా అమృత్ మహోత్సవ్, స్వతంత్ర్యభారత స్వర్ణోత్స వాలను భారీఎత్తున ఏర్పాట్లు చేసున్నట్లు రాజ్యసభసభ్యులు, బిజెపి ఓబీసీ సెల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. ప్రధానమంత్రి మోదీ పిలుపు మేరకు ఆగస్టు 15న సంబురాలు అంబరాన్నిఅంటే విధంగా కనివిని ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. గురువారం గాంధీనగర్ డివిజ న్ పరిధిలోని అశోక్‌నగర్ స్ట్రీట్ నెంబర్-4లో 'హర్‌ఘర్ తిరంగా' నినాదంతో భాగంగా ఇంటింటికీ జాతీయ పతకాన్ని అందించే కార్య క్రమాన్ని స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో బిజెపై ఎం పూర్వ జిల్లా అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్, డివిజన్ బిజెపి అధ్యక్షుడు రత్నాసాయిచంద్, నేతలు బి.యాదగిరిగౌడ్, శ్రీకాంత్, వివిస్టీ.రాజు, జి.జయేందర్‌బాబు, అరుణ జయేందర్, దామోదర్ పి.నర్సింగరావు, సురేశ్, ఆకుల సురేందర్, ఆనంద్‌రావు, సాయికుమార్, నవీన్‌కుమార్, నర్సింహా, హనుమంతు, యాదగిరి, సంతోష్, తులసీ, సంపత్‌యాదవ్, ప్రశాంత్ పాల్గొన్నారు.



జెండాలను పంపిణీ చేస్తున్న డాక్టర్ కె.లక్ష్మణ్, చిత్రంలో కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్‌కుమార్ తదితరులు

**నార్సింగి :** ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా గండిపేట్ మండలంలోని హైదర్షాకోట్‌లో గురువారం "ఫ్రీడమ్ రన్" కార్యక్రమాన్ని నిర్వహించారు. బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్, పలువురు నాయకులు, విద్యార్థులు పర్మేష్ హోటల్ నుంచి గౌతం మాడల్ స్కూల్ వరకు పరుగెత్తారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మన భావి పౌరులైన విద్యార్థులకు స్వాతంత్ర్య వీరుల జీవిత చరిత్రలను తెలుపాలన్నారు. శతాబ్దాల బానిసత్వం నుంచి భారతదేశం స్వాతంత్ర్యం పొంది 75.సంవత్సరాలు అయిన సందర్భంగా సంబురాలను చేయడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులలో దేశభక్తి, క్రమశిక్షణ, గౌరవ భావం వంటివి ఒంటబట్టించాలన్నారు. ప్రతీ ఒక్కరిలో జాతీయతా భావంను పెంచాలని మేయర్ మహేందర్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ వేణుగోపాల్‌రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, ఎస్ఐ సతీస్ కుమార్, కార్పోరేషన్ టీఆర్ఎస్ అధ్యక్షులు గోకరి సురేష్‌గౌడ్, సీనియర్ నాయకులు పాపయనయ యాదవ్, గోపాల్ ముదిరాజ్, రావులకోళ్ల నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఆజాదీకా అమృత్ మహోత్సవాలలో పాల్గొన్న బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్

## అభివృద్ధికి ప్రజా సహకారం అవసరం : ఎమ్మెల్యే మైనంపల్లి

**అల్వాల్, ఆగస్టు 11, ప్రభాతవార్త :** ప్రజా సహకారంతోనే అభివృద్ధి సాధ్యం అవుతుందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తెలిపారు. గురువారం మచ్చబొల్లారం డివిజ న్ పరిధిలో నిర్మాణంలో ఉన్న గోపాల్‌నగర్ నుంచి లప్పం ఫ్యాక్టరీ బిటి రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ జితేందర్‌నాథ్‌తో కలిసి ఎమ్మెల్యే పరిశీలించడం జరిగింది. నిరంతరంగా కురుస్తున్న వర్షాలు కారణంగా రోడ్డు నిర్మా ణ పనులు ఆలస్యం అవుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. అభివృద్ధికి సంబంధించి అన్ని అడ్డంకులను ఎదురించి ముందుకు సాగుతున్నామని తెలిపారు. సీఎం కెసిఆర్ మంత్రి కెటిఆర్ సహాయ సహకారాలు కారణంగా నిధులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉన్నాయన్నారు. దీర్ఘకాలికంగా ఉన్న అనేక సమస్యలను ప్రణాళికాబద్ధంగా అధికమిస్తున్నామని తెలిపారు. ప్రజలు సహృదయంతో సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిఇ మహేష్, ఎసిపి విజయశ్రీ కారొపరేటర్ ప్రేమ్‌కుమార్ టిఆర్ఎస్ నేతలు సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మల్లిఖార్జున్, రాజు యాదవ్, సతీష్, శ్రావణ్, దేవేందర్ పాల్గొన్నారు.



రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

## గుంజుపడుగు ప్రత్యేక మండలం కోసం కృషి చేస్తా
### - డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్

**సికింద్రాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త :** పెద్దపల్లి మంథని మండలంలోని గుంజుపడుగు మేజర్ గ్రామ పంచాయితీని ప్రత్యేక మండలంగా ప్రకటించాలని కోరుతూ గుంజుపడుగు గ్రామస్తులు డిప్యూ టీ స్పీకర్ పద్మారావు గౌడ్‌తో సమావేశమయ్యారు. ఈ మేరకు గుంజుపడుగు, ఉప్పట్ల, మల్లేపల్లి తదితర గ్రామాల సర్పంచ్‌లు కుంటు రాజు, బడికెల నర్సయ్య, ఎరుకల రవి, సుంకు రాంచందర్, సాగర్‌రావు, అందే సదానందం, పెండెం రాజేష్, బాఘేరాజనర్సు ప్రతినిధుల బృదం పద్మారావు గౌడ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ప్రత్యేక మండలం ఏర్పాటు ద్వారానే తమ ప్రాంత సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయని వారు పద్మారావు గౌడ్‌కు వివరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు ఉన్నత స్థాయి నేతలతో ఈ అంశాన్ని చర్చించి మండలం ఏర్పాటుకు కృషి చేస్తామని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు.



పద్మారావు గౌడ్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న గుంజుపడుగు గ్రామ ప్రతినిధులు సుంకు రాంచందర్

## ఆత్మ సంబంధమున్న వాళ్లంతా అన్నాచెల్లెళ్లు అక్కాతమ్ముళ్లే
### - తెలంగాణ బిసి కమిషన్ ఛైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

**రవీంద్రభారతి, ఆగస్టు 11, ప్రభాతవార్త :** ప్రేమతో ఒక బంధాన్ని కలుపుకోవడానికి రక్తసంబంధమే అవసరంలేదని, ఆత్మసంబంధం ఉన్నవాళ్లంతా కూడా అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్లే అవుతారని రాఖీపండుగ ఎలుగెత్తి చాటుతుందన్న తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ ఛైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు... భారతీయ మహోన్నత సంస్కృతికి, సంప్రదాయాలకు నిదర్శనంగా, అన్నా-చెల్లెళ్ళ, అక్కా-తమ్ముళ్ళ ప్రేమానుబంధం మమకారాలను ప్రతీకగా రాఖీ బంధం కలకాలం నిలుస్తుం దని స్పష్టం చేశారు. ఈరోజు రాఖీపండుగను పురస్కరించుకొని నగరానికి చెందిన ఈశ్వరీయ బ్రహ్మాకుమారీస్‌కు చెందిన పలువురు సోదరీమణులు గురువారం ఆయన కార్యాలయంలోని వకుళా భరణం కృష్ణమోహన్‌రావుతోపాటు కమిషన్ సభ్యులు సిహెచ్.ఉపేంద్ర, కె.కిశోర్‌గౌడ్‌లకు రక్షాబంధ నాలను కట్టి, మిఠాయి తినిపించి సోదరీభావాలను ప్రదర్శించుకొన్నారు. ఈ సందర్భంగా వకుళాభర ణం మాట్లాడుతూ సనాతనంగా వస్తున్న సంప్రదాయాలు, ఆచారాలు, భారతీయత గొప్పదనాన్ని తెలుపుతున్నాయని, సోదరభావాన్ని పెంపొందిస్తున్న ఆదర్శవంత రాఖీ పండుగ మనదేశ నైతికతకు, స్త్రీజాతిపట్ల మనకున్న గౌరవాన్ని, బాధ్యతను తెలియజేస్తున్నాయన్నారు. అమ్మ నాన్నల్లో సగమై, అన్నా తమ్ముడవై అన్నీ నీవై అని సోదరీమణులను కంటిపాపలా చూసుకోవాలన్న బాధ్యతను గుర్తుచేసుకునే పండగే ఈ రక్షాబంధన్ అని అక్కా చెల్లెళ్లకు శుభాభినందనలు, శుభాశీస్సులు తెలిపారు.



డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఉపేంద్ర, కిషోర్‌గౌడ్‌కు రాఖీలు కడుతున్న బ్రహ్మకుమారీస్

## వీఎన్ఆర్‌వీజేఐఈటీలో అంతర్జాతీయ సాంకేతిక సదస్సు

**నిజాంపేట్, ఆగస్టు 11, ప్రభాతవార్త :** అడ్వాన్సెస్ ఇన్ కంప్యూటర్ ఇంజనీరింగ్ అండ్ కమ్యూనికేషన్ సిస్టమ్స్ (ఐసీఏసీఈసీఎస్ 2022) సాంకేతిక సదస్సు గురువారం వీఎన్ఆర్‌వీజేఐఈటీ కళాశాలలో ప్రారంభమైంది. ఈ సదస్సుకు జేఎన్‌టీయూ హైదరాబాద్ రెక్టార్ ఆచార్య డా.గోవర్ధన్, గ్రేట్ ఫోర్స్ సిస్టమ్ సీఈఓ ప్రదీప్ మిత్తల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆచార్య డా. రెక్టార్ మాట్లాడుతూ వాస్తవ ప్రపంచంలో సమస్యలు ఏ ఒక్క రంగానికి పరిమితం కావని, సమస్య పరిష్కారానికి సాంకేతికరంగ సమ్మేళనం ద్వారానే సాధ్యమవుతందన్నారు. వీఎన్ఆర్‌వీజేఐఈటీ తరచుగా నిర్వహిస్తున్న సదస్సుల ద్వారా నాణ్యమైన పరిశోధనలు వెలుగు చూస్తున్నాయని, ఇలాంటి సదస్సు ఏర్పాటుకు కృషి చేసిన కార్యనిర్వాహక వర్గాన్ని అభినందించారు. అనంతరం ప్రదీప్ మిత్తల్ మాట్లాడుతూ సిమెంట్ రంగంలో ఎడ్జ్‌కంప్యూటింగ్ ద్వారా కొన్ని కోట్ల రూపాయలు ఆదా చేయవచ్చునని వివరిస్తూ అంకుర సంస్థల ద్వారా రాబోయే రోజుల్లో శాస్త్ర సాంకేతిక రంగాల్లో భవిష్యత్తు ఆశాజనకంగా ఉంటుందన్నారు. కళాశాల ప్రధానోపాధ్యాయుడు ఆచార్య డా. సీ.డీ. నాయుడు మాట్లాడుతూ విద్యా, పారిశ్రామిక రంగాల సమన్వయంతో నిర్వహిస్తున్న సదస్సులో నేర్చుకునే విషయాలు పరిశోధకులు, విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ సదస్సులో అనిందాబోస్, డా. గోపీచంద్, డా. సృజన్‌రాజు, డా. వాలెంతినా ఎమిలియా బలా, సీఎస్ఈ విభాగం అధ్యాపకులు డా. సి.కిరణ్మయి, డా. బి.వి కిరణ్మయి, డా. శివకుమార్, డా. ఎస్.నాగిని, డా. బ్రహ్మానందరెడ్డి, వివిధ దేశాల నుంచి పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సుకరపత్రాలతో అధ్యాపకులు

# ఇంటింటా జాతీయ పతాకం



వేడుకలో పాల్గొన్న నాయకులు





ఫ్రీడమ్ రన్‌లో ఎమ్మెల్యే కెపి వివేకానంద్



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



ఉస్మానియా ఆసుపత్రిలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది



ఫ్రీడం రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సాయన్న కుమార్తె లాస్య నందిత, కొంతం దీపిక తదితరులు

**గన్‌ఫౌండ్రి :** టిఎన్‌జిఓ హైదరాబాద్ జిల్లా ఆద్వర్యంలో రూపొందించిన 200 మీటర్ల జాతీయ జెండా త్రిరంగా ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండా రంగులతో ఉన్న బెలూన్లను ఆకాశంలోకి వదిలారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేన్, ఉపాధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్, కె.శ్రీనివాస్, సభ్యులు వైదిక్‌శాస్త్రి, శంకర్, గీతాసింగ్, ఎం.డి. వహిద్, ముస్తాఫాషరీఫ్, అయోధ్య, మహేందర్, శ్రీధర్‌నాయుడు, ముఖీమ్‌ఖురేషీ, కుత్బీదుద్దీన్ రాజు, జయశ్రీ, ఉమా, జహంగీర్ పాల్గొన్నారు.

**అఫ్జల్‌గంజ్ :** దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన త్యాగధనుల జీవితాలను స్పూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలని ఉస్మానియా ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ బి.నాగేందర్ పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం లభించి 75 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా గురువారం ఉస్మానియాఆసుపత్రిలో చేపట్టిన వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా ఉస్మానియా ఆసుపత్రి వైద్యులు,సిబ్బంది.ఫ్రీడం రన్ నిర్వహించారు. ఆసుపత్రి సూపపరిండెంటెంట్‌డాక్టర్ బి.నాగేందర్‌తోపాటు ఆసుపత్రి వైద్యులు,సిబ్బంది నర్సులు,నర్సింగ్ విద్యార్దినులు జాతీయ పతాకాలను చేతపట్టుకుని ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు సూపరిండెంటెంట్ డాక్టర్ త్రివేణి,పస్ట్ ఆర్.ఎం.ఓ డాక్టర్ శేష్రాది,ఆర్ఎంఒలు సాయిశోభ,బండారి శ్రీనివాసులు, రఫీ,అనురాధ, కవి,సుష్మ, మాధవితో పాటు ఆసుపత్రి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా కోఠిలోని మహిళా యూనివర్సిటీలో కూడా త్రిరంగా ర్యాలీని తెలంగాణహోంశాఖ మంత్రి మహముద్‌అలీ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో యూనివర్సిటి అధ్యాపకులు, పోలీసు అధికారులు, విద్యార్దీనులు పాల్గొన్నారు.

**కంటోన్మెంట్ :** భారత స్వతంత్ర వజ్రోత్సవ వేడుకల్లో ప్రతి పౌరుడు పాల్గొని దేశ భక్తిని చాటుకోవాలని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే సాయన్న కూతురు, మాజీ కార్పొరేటర్ లాస్య నందిత, మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపికలు తెలిపారు. స్వతంత్ర వజ్రోత్స వ వేడుకలను పురస్కరించుకొని గురువారం రెజిమెంటల్ బజార్‌లోని సంతోష్ మాత ఆలయం నుండి మదర్ థెరిస్సా విగ్రహం వరకు నిర్వహిం చిన ఫ్రీడమ్ రన్ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కో-అప్షన్ సభ్యుడు నర్సింహ్మా ముదిరాజ్, టిఆర్ఎస్ నాయకు లు పిట్ల నాగేశ్, సదానంద్ గౌడ్, కసిరెడ్డి, ముప్పిడి మధుకర్, కర్ణకుమార్, నవీణ్, తేజ్‌పాల్, మురళీ యాదవ్, సతీష్, రా ము, పర శరామ్, నర్సింగ్, చింటూ, జోడి బ్రదర్స్ తది తరులు పాల్గొన్నారు.

**1వ వార్డు బాపూజీ నగర్‌లో :** స్వతంత్ర వజ్రోత్స వ వేడుకలను పురుస్కరించుకొని గురువారం కంటోన్మెంట్ 1వ వార్డు బాపూజీ నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గిరిజన హాస్టల్‌లో నిర్వహించిన ప్రీడం రన్ కార్యక్రమాన్ని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు నరిసింహ్మా, పద్మ, ఆసిన్‌ఖాన్, మహేశ్, విజయ్, శ్రీధర్, మల్లికార్జున్, హెడ్‌మాస్టర్లు వెంకటేశ్వర్లు, నీలిమా తదితరులు పాల్గొన్నారు.

**అడ్డగుట్ట :** స్వతంత్ర దినోత్సవ వేడుకలను బారీ ఎత్తున నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావలిన అడ్డగుట్ట డివిజన్ కార్పోరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్ తెలిపారు. స్వతంత్ర వజ్రోత్సవ వేడుకలను పురుస్కరించుకొని బుధవారం అడ్డగుట్టలో నిర్వహించిన ప్రీడం రన్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ దశరత్, నగర గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్, తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప, టిఆర్ఎస్ నాయకులు నక్క మధు, వసంత, శ్రీనివాస్ గౌడ్, పొన్నాల రాజు, ఎల్లయ్య, మహ్మద్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

**సికింద్రాబాద్ :** స్వాతంత్ర్య పోరాటంలో అనేకమంది తమ ప్రాణాలను త్యాగాలు చేశారని, వారిని స్వరించుకోవడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ అన్నారు. 75వ స్వాతంత్ర్య వజ్రోత్సవాలలో భాగాంగా సీతాఫల్‌మండిలోని మల్టీపర్పస్ పంక్షన్‌హాల్ వద్ద నుంచి చిలకలగూడ చౌరస్తా వరకు దాదాపు 3వేల మందితో ఫ్రీడంరన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ అనేకమంది ప్రాణ త్యాగాలతో వచ్చిన స్వాతంత్ర్యాన్ని వజ్రోత్సవాలుగా నిర్వహించుకుంటున్నామని, ఇందులో భాగంగా పోరాటంలో అసువులుబాసిన వారిని గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వారిని స్మరించుకోవడంతో పాటు దేశంకోసం మనంకూడా ఎంతోకొంత చేయాలని అన్నారు. వజ్రోత్సవాలలో భాగంగా ప్రతిఒక్కరు వారివారి నివాసాలపై జాతీయ పతాకాన్ని ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అదేమనం దేశానికి ఇస్తున్న గౌరవమని అన్నారు. ముఖ్యంగా యువత జాతీయ పతాకాలను అవిష్కరించి మిగతావారికి స్ఫూర్తినివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు కరాటేరాజు, జలంధర్‌రెడ్డి, శైలేందర్, లలిత ఇతర నేతలు పాల్గొన్నారు.

**హైదరాబాద్ :** చైతన్యపురి డివిజన్ తెరాస నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి జాతీయజెండాలను గురువారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆదేశాల మేర 75వ స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరిచుకొని చైతన్యపురి డివిజన్‌లోని న్యూ ఇందిరానగర్, అంబేద్కర్‌నగర్ కాలనీలలో చంద్రశేఖర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెరాస నాయకులు కృష్ణ, జలంధర్, సంతోష్‌యాదవ్, పులికిరణ్, విజయ్, రమేష్, నరేష్, శంకర్, రాజు, శ్రీకాంత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

**తార్నాక :** వజ్రోత్సవ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందని నగర డిప్యూటీమేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి పేర్కొన్నారు. ఓ.యూ పోలీసుల ఆద్వర్యంలో వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా ఓ.యూ ఆర్ట్స్ కాలేజ్ నుంచి ఎన్‌సీసీ గేట్ వరకు ఫ్రీడం రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటిటా జాతీయ జెండాను ఎగురవేసి మహనీయులను స్మరించుకోవాలని కోరారు. ఈస్ట్‌జోన్ డీసీసీ చక్రవర్తి గుమ్మి మాట్లాడుతూ పోలీసుల ఆద్వర్యంలో క్రీడారన్, మొక్కల నాటడంతో పాటు వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరు మహనీయులను త్యాగాలను స్మరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతె శోభన్‌రెడ్డి, ఏసీపీ ఆకుల శ్రీనివాస్, ఓ.యూ ఇన్స్‌పెక్టర్ ఎల్. రమేష్ నాయక్, నల్లకుంట, కాచిగూడ ఇన్స్‌పెక్టర్లు మొగిలి చెర్ల రవికుమార్, అబిబుల్లా ఖాన్, డిఐ దుబ్బ కిషన్, ఓ.యూ ఎస్సైలు లక్ష్మినారాయణ, భార్గవి, నరేష్, రవి, శాంతిసోవా, భిక్షంతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**పేట్‌బషీరాబాద్ :** 75వ 'భారత స్వతంత్ర వజ్రోత్సవ' వేడుకల్లో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన 'ఫ్రీడమ్ రన్'ను గురువారం ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఫ్రీడమ్ రన్ దూలపల్లి జంక్షన్ నుంచి పేట్‌బషీరాబాద్ వరకు 2కిలోమీటర్లు ఎమ్మెల్యే వివేకానంద్, మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ పరుగెత్తారు. ఈ 'ఫ్రీడమ్ రన్'లో పేట్‌బషీరాబాద్ ఏసీపి రామలింగ రాజు, సీఐ ప్రశాంత్, మున్సిపల్ కమిషనర్ రఘు, వైస్ చైర్మన్ గంగయ్యానాయక్, కౌన్సిలర్లు, టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

**జీడిమెట్ల :** 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిని చాటాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. 'ఆజాదీకా అమృత్ మహోత్సవ్' వేడుకల్లో భాగంగా బీజేవైఎం గాజులరామారం డివిజన్ చిత్తారమ్మ ఆలయం వద్ద నిర్వహించిన బైక్ ర్యాలీని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరు తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశంపై ఉన్న ప్రేమను, భక్తిని చాటాలన్నారు. గాజులరామారం డివిజన్‌లోని కాలనీలు, బస్తీలలో ఇంటింటికి తిరుగుతూ జాతీయ జెండాలను పంపిణీ చేయాలని బీజేపి కార్యకర్తలకు సూచించామన్నారు. ఈ ర్యాలీ చిత్తామరమ్మ ఆలయం నుంచి సూరారం మీదుగా ఐడీపీఎల్ వరకు కొనసాగింది. ఈ బైక్ ర్యాలీలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్, చల్లా ప్రభాకర్, దయాకర్, మహేష్, సాయిరాంరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**నిజాంపేట్ :** 75వ భారత స్వతంత్ర వజ్రోత్సవాల్లో బాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్‌లో గురువారం 'ఫ్రీడమ్ రన్' కార్యక్రమంలో మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ 2కె ఫ్రీడమ్ రన్ ప్రగతి నగర్ అమరవీరుల స్థూపం నుంచి ఇన్‌కాయిస్ మీదుగా మూడు కోతుల బొమ్మల చౌరస్తా వరకు సాగింది. అనంతరం 2కె రన్‌లో గెలుపొందిన వారికి మొమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీ శిల్పవల్లి, ట్రాఫిక్ ఏసీపీ హన్మంతరావు, ఎన్ఎంసీ కమిషనర్ వంశీకృష్ణ, కార్పొరేటర్లు, బాచుపల్లి సీఐ నరసింహారెడ్డి, పోలీస్ సిబ్బంది, ఎన్ఎంసీ అధికారులు విజ్ఞాన్ జ్యోతి కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తెరాస నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జాతీయ జెండా పంపిణీ చేస్తున్న టిఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు



ఫ్రీడం రన్ నిర్వహిస్తున్న జక్కుల మహేశ్వర్‌రెడ్డి



ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లింగాని ప్రసన్న, డిప్యూటీ కమిషనర్ దశరత్ తదితరులు



ఆర్ట్స్ కాలేజ్ ఎదుట పాల్గొన్న డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి, డీసీపీ చక్రవర్తి పోలీస్ అధికారులు



2కె రన్‌ను ప్రారంభిస్తున్న కొలన్ నీలాగోపాల్‌రెడ్డి



## లక్ష్మీగణపతి దేవాలయంలో పూల మొక్కల ఏర్పాటు

**చిక్కడపల్లి, ఆగస్టు 11, ప్రభాతవార్త :** భారత దేశ వజ్రోత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని శ్రీ లక్ష్మీగణపతి దేవాలయంలో గురువారం పూల మొక్కలు ఏర్పాటు చేసే కార్యక్రమం ఆలయం ఈవో లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా జాతీయ జెండాలను కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయం అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# రాఖీ సంబురం



రాఖీ కడుతున్న కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్

**అల్వాల్, ఆగస్టు 11, ప్రభాతవార్త :** అన్నా చెల్లెళ్ళ పవిత్ర బందానికి నిదర్శనంగా నిలిచే రాఖీ సంబురాలు వెంకటాపురంలో గురువారం జరిగాయి. స్థానిక కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్ సోదరులకు రాఖీలు కట్టారు. ప్రజలకు ఆమె రాఖీలు పంచి పెట్టారు. సోదరుల దీవెనలు ప్రతి ఒక్క సోదరీమణికి అవసరమని సబిత తెలిపారు. ఈ కార్యక్రమంలో అమృత, కల్పన, స్వప్న, సంతోష్, మోసిన్, ప్రభాకర్, సాయికుమార్, జానర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు తెలుగుయూనివర్శిటీ ఆడిటోరియంలో ఆంధ్రమహా భారత అవతరణ, నన్నయ్య సహస్రాబ్ది మహోత్సవాలు
### - హాజరుకానున్న గవర్నర్లు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు



కరపత్రం ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు సుహాసిని, ఆనంద్, రాజగోపాల్

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త :** రాసికేర్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 13న పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఆంధ్రమహాభారత అవతరణ సహస్రాబ్ది ,నన్నయ్య సహస్రాబ్ది మహోత్సవాల మూడవ దశ నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధి డాక్టర్ కె.సుహాసిని ఆనంద్ వెల్లడించారు. ఈమేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా భారత ప్రభుత్వం సాంస్కృతికశాఖ సౌజన్యంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో మూడు చోట్ల ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే జూలై 23న రాజమహేంద్రవరంలో ఆదికవి నన్నయ్య భట్టారకుడు, ఆయన ప్రోత్సహించిన మహారాజు రాజరాజ నరేంద్రుడు మహనీయుల స్మృతిలో తొలిదశ వేడుకలకు శ్రీకారం చుట్టామని, 30వ తేదీన విశాఖలో ద్వితీయ వేడుకలను నిర్వహించామని ఆమె వివరించారు. ఆగస్టు 13న హైదరాబాద్‌లో తృతీయ వేడు నిర్వహించడంతో ఈజమిలి మహోత్సవాలు ముగియనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఉదయం 9.30గంటలకు గవర్నర్ తమిళసై కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని సాయంత్రం వరకు ఎడతెరపిలేకుండా సాహితీ ప్రసంగాలు, కవిసమ్మేళనం, ఆంధ్ర మహాభారత అవతరన సాహిత్య రూపకం జరుగుతుందన్నారు. సాయంత్రం ఆరున్నర గంటలకు నిర్వహించే సభకు ముఖ్య అతిథిగా హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర సాంస్కృతిక మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ సురభీవాణిదేవి, మహా సహస్రావధాని గరికిపాటి నర్సింహ్మారావు, భారతీయం సత్యవాణి, విశిష్ట అతిథుల గా పూ జ్యశ్రీ స్వామి, ఉడిపి పెజావర్ మఠాధిపతి ప్రసన్న తీర్థాచార్య స్వామిజీ ఆశీర్వాధార్భషణం చేస్తారన్నారు. ఈసమావేశంలో సంస్థ ప్రతినిధులు పాలగుమ్మి రాజగోపాల్, కొమరగిరి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య సమరయోదులను ఆదర్శంగా తీసుకోవాలి

**యూసుఫ్‌గూడ, ఆగస్టు 11, ప్రభాతవార్త :** దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోదులను ప్రతిఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పుర స్కరించుకుని బిజేపి నాయకులు కార్యక ర్తలు ఏర్పాటు చేసిన బైక్‌ర్యాలీలో మంత్రి కిషన్‌రెడ్డి డాక్టర్ లక్ష్మణ్, చింతల రామచంద్రారెడ్డి, హైదరాబాద్ సెంట్రల్‌జిల్లా బిజేపి అధ్యక్షులు గౌతమ్‌రావులు పాల్గొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రతివ్యక్తి వారివారి నివాసాలపైన జాతీయ జెండాలను ఎగురవేయాలని సూచించారు. అంతకు ముందు మహావీరుడు ఓరుగల్లుకు చెందిన స్వాతంత్ర్య సమరయోదుడు మొగళయ్య గౌడ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గం బిజేపి ఇన్‌చార్జ్ లంకల దీపక్‌రెడ్డి, మాజీ కార్పోరేటర్‌లు కంజర్ల సదాశివ యాదవ్, కిలారి మనోహర్, బిజేపి నాయకురాలు డాక్టర్ పద్మ వీరపనేని, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బిజేపి అధికార ప్రతినిది కొలన్ సత్యనారాయణ,కుంబాల గంగరాజు, శ్యామ్‌సుందర్‌గౌడ్, నందికాశీ విజయ్‌కుమార్, జబార్, పాల్గొన్నారు.



బైక్‌ర్యాలీలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

## అంబర్‌పేట్ మహంకాళీ అమ్మవారికి 10కిలోల వెండి అందజేత

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త :** అంబర్‌పేట్ మహంకాళీ అమ్మవారికి వెండిచీర తయారీ కోసం స్థానికులైన గుడిదేన రాజేష్‌గౌడ్ కళ్యాణిగౌడ్ దంపతులు 10కిలోల వెండిని ఇచ్చి తమ భక్తిని చాటుకున్నారు. గురువారం ఆయల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులకు వెండిని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ దసర నవరాత్రులు సందర్భంగా అమ్మవారికి అలంకరించబడుతుందన్నారు. జనగాం సత్తిబాబుగౌడ్, పంజాల జ్ఞానేశ్వర్‌గౌడ్, మొర పాండు ముదిరాజ్, వై.శంకర్‌గౌడ్, గడ్డం శ్రీధర్‌గౌడ్, సుధాకర్, రంగంపల్లి రాజు, పెదూరి కృష్ణగౌడ్, గడ్డం శశిధర్‌గౌడ్, కిశోర్‌గౌడ్, స్వర్ణకారుడు కొక్కొండ జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.



వెండిని అందజేస్తున్న రాజేష్, కళ్యాణి గౌడ్

# సంక్షేమ హాస్టళ్ల మెస్‌ఛార్జీలను 3వేలకు పెంచండి

## బిసి సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శికి బిసి విద్యార్థి సంఘం వినతి

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త :** పెరిగిన ధరలకు అనుగుణంగా సంక్షేమ హాస్టళ్ల మెస్‌ఛార్జీలను 3వేలకు పెంచాలని తెలంగాణ బిసి విద్యార్థి సంఘం బిసి సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి బూర వెంకటేశంను కోరింది. ఈమేరకు గురువారం రాష్ట్ర అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గొడుగు మహేశ్‌యాదవ్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం వినతిపత్రం అందజేసింది. అనంతరం వారు తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత మెస్‌ఛార్జీలు 2015లో పెంచడం జరిగిందని కానీ నేడు ధరలు విపరీతంగా పెరడటం వల్ల హాస్టళ్లలో విద్యార్థులకు పోష్టిక ఆహారం అందించలేకపోతున్నారన్నారు. అదేవిధంగా ప్రతి హాస్టల్‌లో వందనుంచి నూటయాభై మంది విద్యార్థులు ఉంటే వారికి కేవలం ముగ్గురు మాత్రమే వర్కర్లు ఉన్నారని హాస్టళ్లు పరిశుభ్రంగా ఉండాలంటే ప్రతి హాస్టల్‌కు ఆరుగురు వర్కర్లను కేటాయించాలన్నారు. ప్రస్తుతం నడుస్తున్న సంక్షేమ హాస్టళ్ల సంక్షోభంలో కూరుకుపోతున్నాయని కాబట్టి విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని బిసి సంక్షేమ హాస్టళ్లను సందర్శించి వారి స్థితిగతులు తెలుసుకోవాలని ప్రస్తుత ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలను 3వేలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు.



బూర వెంకటేశంకు వినతిపత్రం ఇస్తున్న కుల్కచర్ల శ్రీనివాస్, గొడుగు మహేష్‌యాదవ్ తదితరులు

# రాజకీయాల్లో స్ట్రాటజీ, సర్వేలు ప్రధానంగా మారాయి

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త :** ప్రస్తుతం రాజకీయాల్లో స్ట్రాటజీ, సర్వేలు ప్రధానంగా మారాయని ప్రముఖ స్ట్రాటజిస్ట్ శ్రీనివాస్ శరకడం అన్నారు. ఈమేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో అడుగుపెట్టి ఎమ్మెల్యే, ఎంపి అవుదామనుకుంటున్న ఔత్సాహికులకు స్ట్రాటజీ సేవలు అందించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నట్లు తెలిపారు. రాజకీయాల్లో ఉన్నత స్థానం పొందేందుకు స్ట్రాటజీస్, మార్కెటింగ్ కొత్త కాదని ఇందిరాగాంధీ కాలం నుంచి ఉండేదని అయితే ఇప్పుడు టెక్నాలజీ సమాజంలో ఒకభాగం అయినందున చాలామంది అన్వయించుకోవడంలో వెనకబడుతున్నారని, అందులో డిజిటల్ మార్కెటింగ్, ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ ప్రధానమైనవన్నారు. 2013 డిసెంబర్ ఎలక్షన్స్‌లో కేజ్రీవాల్ డిజిటల్ టీం పనితనం, 2014లో మోదీ టీమ పనితనం, అన్ని ఎలక్షన్లలో కేసిఆర్ ప్రసంగం గమనిస్తే అర్థమువుతుందన్నారు. కావున రాబోయే తరాల్లో స్ట్రాటజీకోరుకునే వారికి తమ సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన పేర్కొన్నారు.

# మార్కెట్‌లో పోలీస్ పెట్రోలింగ్ ఔట్ పోస్టులను ఏర్పాటు చేయాలి : ఛైర్మన్ అనితానాయక్

**మలక్‌పేట, ఆగస్టు 11, ప్రభాతవార్త :** హైదరాబాద్ నగరంలో ప్రముఖ మార్కెట్ అయిన మలక్‌పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్‌లో పోలీస్ పెట్రోలింగ్ ఔట్ పోస్టులను ఏర్పాటు చేయాలని నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ అనితానాయక్ పేర్కొన్నారు. అజంపురలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ సమక్షంలో ఈ మేరకు ఆమె తూర్పు మండల డిసిపి చక్రవర్తికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుమారు 42 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మలక్‌పేట మార్కెట్ యార్డులో దాదాపు 2 ఎకరాల విస్తీర్ణంలో మాత్రమే వ్యాపార కలాపాలు నిర్వహిస్తున్నారని సుమారు 450 వ్యాపార, నివాస భవన సముదాయాలు ఉన్నాయని వివరించారు. ఉదయం సాయంత్రం రాత్రివేళల్లో మార్కెట్‌లో పలువురు వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకుంటారని అదే విధంగా రైతులు సరుకులను విక్రయించడానికి మార్కెట్ వస్తారని వివరించారు. మార్కెట్‌లో పలు దొంగతనాలు జరుగుతున్నాయని వ్యాపారస్తులు మార్కెట్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. మార్కెట్‌లో దొంగతనాలు జరుగకుండా ఉండడంకోసం పోలీస్ పెట్రోలింగ్ ఔట్ పోస్టులను ఏర్పాటు చేసి చర్యలు చేపట్టాలని ఆమె పేర్కొన్నారు.



డిసిపి చక్రవర్తికి వినతి పత్రం సమర్పిస్తున్న ఛైర్మన్ అనితానాయక్

# త్రిరంగా జెండా ర్యాలీలో మంత్రులు

**గన్‌ఫౌండ్రి, ఆగస్టు 11, ప్రభాతవార్త :** భారత స్వాతంత్ర వజ్రోత్సవాలను పురస్కరించుకుని తెలంగాణ నాన్‌గజిటెడ్ హైదరాబాద్ జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం. ముజీబ్‌హుస్సేన్ ఆధ్వర్యంలో త్రిరంగా ర్యాలీ అత్యంత ఘనంగా నిర్వహించారు. సుమారు 200మీటర్ల జాతీయ జెండాను యావత్ తెలంగాణ ఉద్యోగుల సమక్షంలో మంత్రులు మహముద్‌అలీ, శ్రీనివాస్‌గౌడ్, టిఎన్ జిఒ ప్రతినిధులు ఎం.రాజేందర్, ఆర్.ప్రతాప్‌లు ర్యాలీని ప్రారంభించారు. నాంపల్లి గృహకల్ప ఆవరణలోఉన్న టిఎన్‌జిఒ కార్యాలయం నుంచి ప్రారంభమైన త్రిరంగా ర్యాలీ గన్‌పార్క్‌లోని అమరవీ రుల స్థూపం వరకు కొనసాగింది. స్వాతంత్ర సమరయోధులు, తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ జైభారత్, జై తెలంగాణ నినాదాలతో మారుమ్రోగింది. అమరవీరుల స్థూపం వద్ద నివాళ్లు అర్పించి జాతీయ గీతంతో కార్య క్రమాన్నిముగించారు. జిల్లా కార్యదర్శి ఎస్.విక్రమ్‌కుమార్, ఉపాధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్, అసోసియేట్అధ్యక్షులు వరదరాజు, కోశాధికారి బాల్‌రాజ్, కె.శ్రీనివాస్, జిల్లా 60 యూనిట్లు అధ్యక్షులు, కార్యదర్శులు, వివిధ యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న మంత్రులు మహముద్‌అలీ, శ్రీనివాస్‌గౌడ్, టిఎన్‌జిఓ ప్రతినిధులు ఎం.రాజేందర్, ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేన్‌లు

# జాతీయ జెండాల పంపిణీ



జెండాలను పంపిణీ చేస్తున్న కొలన్ వీరేందర్ రెడ్డి



పుస్తె శ్రీ కాంత్ జెండాను పంపిణీ చేస్తున్న దృశ్యం



ఫ్రీడమ్‌రన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

**నిజాంపేట్, ఆగస్టు 11, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్‌కు చెందిన సాయి అనురాగ్ కాలనీ అసోసియేషన్ సభ్యులు గురువారం కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. డ్రైనేజీ, మంజీరా పైపులైన్లు ఏర్పాటు చేసినందుకు కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు కాలనీలో రోడ్లు పూర్తిగా గుంతలమయంగా ఉందని, రోడ్లపై ఉన్న రాళ్ళతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని, నూతన రోడ్లు ఏర్పాటు చేయాలని కార్పొరేటర్‌కు వినతి పత్రం అందించారు. స్పందించిన కార్పొరేటర్ అధికారులతో మాట్లాడి నూతన రోడ్ల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. అనంతరం కార్పొరేటర్ అసోసియేషన్ సభ్యులకు, కాలనీవాసులకు జాతీయ జెండాలను పంపిణీ చేశారు.

**బేగంపేట :** మహంకాళీ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం ప్యాట్నీ చౌరస్తా నుంచి బైబిల్ హౌస్ వరకు ఫ్రీడం రన్ నిర్వహించారు. ర్యాలీని నార్త్‌జోన్ డీసీపీ చందనాదీప్తి జెండా ఊపి ప్రారంభించారు. ఈ భారీ ర్యాలీలో వంద మందికి పైగా జాహ్నవి, ఎస్‌విఐటీ ఎన్‌సిసి క్యాడెట్లు విధ్యార్థులు జాతీయ జెండాలను చేతబూని ర్యాలీలో పాల్గొన్నారు. జాతీయ పతాక విశిష్టతను, భారత జాతి గొప్పదనాన్ని చాటిచెప్పే ఎన్నో నినాదాలను విద్యార్థులు పలికారు. ప్యాట్నీ నుంచి బైబిల్ హౌస్ వరకు సాగిన ఈ ర్యాలీలో నార్త్‌జోన్ డీసీపీ చందనాదీప్తి, మహంకాళీ ఏసీపీ రమేష్, ఇన్స్‌పెక్టర్లు కావేటి శ్రీనివాసులు, నాగేశ్వరరావు, నర్సింగరావు, ఎస్సై రాంబాబు ఎన్‌సిసి క్యాడెట్లు, విధ్యార్థులు, పాల్గొన్నారు.

**నార్సింగి :** దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75. సంవత్సరాలు అయిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో "ఆజాదీకా గౌరవ్ పాదయాత్ర" దేశమంతా జరుగుతుంది. ఈ కార్యక్రమాన్ని గురువారం బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లో కాంటెస్టెడ్ ఎమ్మెల్యే బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్, అధ్యక్షులు పూలపల్లి రాజేందర్‌రెడ్డి, క్యాతం అశోక్ యాదవ్ తదితరులతో కలిసి ఆజాదీకా గౌరవ్ పాదయాత్రను హిమాయత్ సాగర్‌లో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జై కాంగ్రెస్... జైజై కాంగ్రెస్... అంటూ నాయకులు, కార్యకర్తలు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ అనేక ఉద్యమాలు, పోరాటాలు చేసిందన్నారు. వేలాది మంది కాంగ్రెస్ నాయకులు ఆత్మ బలిదానాలు చేసుకున్నారన్నారని తెలిపారు. నేడు మనదేశం అన్ని రంగాలలో ప్రపంచ దేశాలతో పోటీ పడుతుందంటే దానికి పునాది వేసింది కాంగ్రెస్ పార్టీయే అని వివరించారు. లక్షలాది మంది దేశ ప్రజలలో అహింస అనే ఆయుధంను నాటి ఆంగ్లేయులను గడగడలాడించిన మహాత్మ గాంధీ కూడా కాంగ్రెస్ నాయకుడే అని తెలిపారు. నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారం కోసం ఉద్యమిస్తామన్నారు. అధికారులు, పాలకులకు సమస్యలు తెలిపి పరిష్కరిస్తామన్నారు. గండిపేట మండలంలోని మూడు మున్సిపాలిటీల పరిధుల్లో పాదయాత్రను నిర్వహించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యవంతులను చేస్తామని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షులు చల్ల నర్సిహ్మారెడ్డి, శంషాబాద్ మండల అధ్యక్షులు శేఖర్ యాదవ్, సీనియర్ నాయకులు నరపేందర్, బాలరాజు, తాజుద్దీన్, సంజయ్ యాదవ్, నవీన్, ఖాద్కర్, శ్రీనివాస్‌గౌడ్, ధనంజయ్, పాపిరెడ్డి, ఆంజనేయులు, దొబ్బ లక్ష్మణ్, అభిలాష్, గణేష్, ప్రణయ్ పాల్గొన్నారు.

**హైదరాబాద్ :** 75వ స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఘర్‌ఘర్ తిరంగ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటా జాతీయ పతాకాన్ని ఎరుగవేసేందుకు పిలుపునిచ్చిన నేపథ్యంలో మలక్‌పేట మున్సిపల్ కాలనీలోని ఉదయ్‌నగర్ కాలనీ రెసిడెన్సీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో జెండాల పంపణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వెల్ఫేర్ అసోసియేషన్ వైస్ ప్రసిడెంట్, తెలంగాణ అసెంబ్లీ కార్యాలయ కార్యదర్శి పూర్ణబోధ శ్రీకాంత్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమ నిర్వహించారు. మలక్‌పేట శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం వెనుక ఉన్న మున్సిపల్ కాలనీ జిహెచ్‌ఎంసి పార్కులోని వాకర్స్, స్థానికులకు జాతీయ జెండాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాలను సరఫరా చేసిన జిహెచ్‌ఎంసికి అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



మహంకాళి పోలీసుల ఆధ్వర్యంలో ప్యాట్నీ చౌరస్తా నుంచి సాగిన ఫ్రీడం రన్ ర్యాలీ

**చార్మినార్ :** ఆజాదీ కా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం పాతబస్తీ న్యూ మోడరన్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన సీనియర్ టిఆర్‌ఎస్ నాయకురాలు గుంటి మంజుల రాణి మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు. దూద్‌బౌలిలోని న్యూ మోడరన్ హైస్కూల్ నుంచి ప్రారంభమైన తిరంగా ర్యాలీ పలు ప్రాంతాలు మీదుగా కొనసాగిన అనంతరం తిరిగి పాఠశాలకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో సీనియర్ టిఆర్‌ఎస్ నాయకురాలు మంజుల రాణి, న్యూ మోడల్ హైస్కూల్ కరస్పాండెంట్ ఖలీల్ ఉర్‌రెహ్మాన్‌తో పాటు పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

**పురానాపూల్ డివిజన్ :** ఆజాదీ కా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం పురానాపూల్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో హైదరాబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం టిఆర్‌ఎస్ ఇంఛార్జి పుస్తె.శ్రీకాంత్, సీనియర్ టిఆర్‌ఎస్ నాయకులు పెండ్యాల లక్ష్మణ్, విష్ణుగౌడ్‌తో పాటు పలువురు జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పుస్తె శ్రీ కాంత్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన స్వాతం త్ర్య సమర యోధుల త్యాగాలను మనం ఎప్పటికి మరువలేమని తెలిపారు. పలువురు టిఆర్‌ఎస్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



హిమాయత్ సాగర్‌లో ఆజాదీకా గౌరవ్ పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకుల దృశ్యం



ర్యాలీలో పాల్గొన్న సీనియర్ టిఆర్‌ఎస్ నాయకురాలు మంజులు రాణి, పాఠశాల విద్యార్థులు



హైకోర్టు అడ్వకేట్స్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**తెలంగాణ రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ :** ఆజాదీ కా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు హైకోర్టు నుంచి మదీనా వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు.

**ధర్నాచౌక్ :** స్వతంత్ర్య భారత వజ్రోత్సవాలలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పిలుపునిచ్చారు. గురువారం స్వతంత్ర్య భారత వజ్రోత్సవాలలో భాగంగా చిక్కడపల్లి పోలీస్ సబ్ డివిజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రీడమ్ రన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవాడిగూడ లోని ఎన్టీఆర్ స్టేడియం నుండి చిక్కడపల్లి మెట్రో స్టేషన్ వరకు ఫ్రీడమ్ రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పోరేటర్ రచనశ్రీ, సెంట్రల్‌జోన్ డీసీపీ రాజేష్ చంద్ర, చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి, గాంధీనగర్ ఇన్స్పెక్టర్ మోహన్‌రావు, చిక్కడపల్లి సీఐ సంజయ్‌కుమార్, ముషీరాబాద్ సీఐ జహంగీర్‌యాదవ్, టీఆర్‌ఎస్ నాయకులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# ఉత్తమ గ్రంథపాలకుల అవార్డుల ప్రదానం

**చిక్కడపల్లి, ఆగస్టు 11, ప్రభాతవార్త :** గ్రంథపాలకుల దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రజాగ్రంథాలయాల అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ గ్రంథపాలకుల అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నట్లు సంఘం అధినేత కొక్కుల దేవేందర్, ప్రధాన కార్యదర్శి దాచేపల్లి బుచ్చయ్య వివరించారు.

# ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సుపై పడిన భారీ చెట్టు



ఆర్టీసీ బస్సుపై పడి రోడ్డుకు అడ్డంగా పడిన భారి చెట్టు

**తార్నాక, ఆగస్టు 11, ప్రభాతవార్త :** నాచారం ప్రధాన రోడ్డులో ప్రయాణిస్తున్న ఓ ఆర్టీసీ బస్సుపై అకస్మాత్తుగా భారీ చెట్టుపడిపోయింది. అదృష్టవశాత్తు ప్రయాణికులకు ఎవరికి ఎలాంటి ప్రమాదం జరుగకపోవడంతో అందరు ఊపిరిపీల్చుకున్నారు. బస్సు అద్దాలు ముందు వెనుక బాగంలో పూర్తి ధ్వంసం అవ్వడంతో పాటు బస్సు డ్యామేజ్ అయ్యింది. రోడ్డుకు అడ్డంగా చెట్టుపడిపోవడంతో చాలా సేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. స్థానిక నాచారం పోలీసులు వచ్చి చెట్ల కొమ్మలను తొలగించి పక్కకు తొలగించారు. ఇసిఐఎల్ నుంచి అప్పల్‌గ్ వైపు వెళ్లుతున్న ఆర్టీసీ బస్సు నాచారం హెచ్‌ఎంటీ నగర్ కమాన్ వద్దకు చేరుకోగానే ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

# జన్మదిన శుభాకాంక్షలతో నమ్మిచి మహిళపై అత్యాచారం, కేసు నమోదు

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 11, ప్రభాతవార్త :** బ్యూటీషిన్ కోర్సు చేసిన ఓ నిరుద్యోగ యువతిని మాయమాటలతో నమ్మించి అత్యాచారం చేసిన ఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బూటీషియన్ కోర్సు చేసిన షాదీనగర్‌కు చెందిన ఓ యువతి జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాజులరామారంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటుంది. బ్యూటీషియన్‌గా ఉద్యోగం వెతుకుతున్న ఆమెకు సంజీవరెడ్డి అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. దీంతో ఆమెకు స్వంతంగా బ్యూటీపార్లర్ పెట్టిస్తానని చెప్పి ఆశచూపిన సంజీవరెడ్డి పలుమార్లు అత్యాచారం చేశాడని పోలీసులు తెలిపారు. జులై 29న ఆమె జన్మదినం సందర్భంగా ఆమె వుండే అపార్ట్‌మెంట్‌కు వచ్చిన సంజీవరెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆమెపై అత్యాచారం చేసి పారిపోయాడు. ఈవిషయమై ఆ యువతి జీడిమెట్ల పోలీసులను ఆశ్రయించింది. జీడిమెట్ల సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ పవన్ కేసు దర్యాప్తుచేస్తున్నారు.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC

సంక్షిప్త టెండరు ప్రకటన

ప.నెం.1, నిట్ నెం.18/SEM/LBNZ/GHMC/J2&J3/2022-23, తేది: 10.08.2022, పని పేరు: GHMC, ఎల్.బి.నగర్ జోన్ యందు 8 నెం.ల వరద నీటి కాలువల పనులు మరియు GHMC, ఎల్.బి.నగర్ జోన్ యందు, 1 నెం. BT రోడ్డు పని, మొత్తం విలువ: రూ.లక్షల్లో: 963.30, బిడ్‌ల స్వీకరణకు ప్రారంభ/చివరి తేది మరియు సమయము: డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 11.08.2022న మ.3.00 గం.లు, బిడ్ దాఖలుకు ముగింపు తేది: 18.08.2022న మ.3.00 గం.లు, సాంకేతిక బిడ్ తెరుచు తేది: 18.08.2022న మ.3.30 గం.లు, ప్రైస్ బిడ్ తెరుచు తేది: 18.08.2022న మ.3.40 గం.లు, పేరు మరియు చిరునామా, కార్యాలయ ఫోన్ నెం. SE-M, LBNZ, GHMC జోనల్ కార్యాలయము, గడ్డి అన్నారం, హైదరాబాద్, Ashokreddy.v@gov.in; 9701362708. మరిన్ని వివరములను https://tender.telangana.gov.in పై చూడగలరు.

DIPR.No.5554-PP/CL/Advt/1/2022-23, తేది: 11.08.2022 సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్-M, ఎల్.బి.నగర్ జోన్, GHMC

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
పటాన్‌చెరు & రామచంద్రాపురం సర్కిల్-22, శేరిలింగంపల్లి జోన్
GHMC

సంక్షిప్త టెండరు ప్రకటన నం. Engg-19/GHMC/PTC-C22/2022-23, Dt: 11.08.2022. నిట్ నెం. Engg-12/GHMC/PTC-C22/2022-23, తేది: 30.06.2022. పనిపేరు: GHMC, శేరిలింగంపల్లి జోన్, పటాన్‌చెరు సర్కిల్-22 యందు గల వార్డు నెం.113లో పోలీస్‌స్టేషన్ ప్రక్కన గల మైత్రి మైదానంలో రాతి మొరంతో లెవెలింగ్ చేయుట. సుమారు విలువ/ECV: రూ. 7.60 లక్షలు. డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 12.08.2022న ఉ.10.30గం.లు. బిడ్‌ల స్వీకరణకు చివరి తేదీ మరియు సమయము: 16.08.2022న ఉ.11.00గం.లు. ఇఇ పేరు మరియు చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, పటాన్‌చెరు సర్కిల్-22, ఫోన్ నం.8978026758. మరిన్ని వివరములను ఇ-ప్రొక్యూర్‌మెంట్ https://www.tender.telangana.gov.in పై చూడగలరు.

DIPR.No.5548-PP/CL/Advt/1/2022-23 తేది: 11.08.2022 సం/-ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పటాన్‌చెరు సర్కిల్-22, Slp జోన్, GHMC.

BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-2
1st Floor, Treveni Complex, Palace Heights Hotel Building, Abids, Hyderabad-1
O.A. No. 303 of 2020
Between:
**State Bank of India,** SARB-2, Chikadpally, Hyderabad ... **Applicant**
AND
**M/s.Nima Sales Agencies Pvt. Ltd & others** ... **Defendants**
To,
**Smt. Dorai Suhasini,** R/o.S-1, 3rd floor, Sai Tirumala Towers, GV Reddy Colony, Alwal, Secunderabad -500010 **(Defendant No.2)**
Take notice that the Applicant-bank has filed a case for recovery of **Rs.2,95,37,400/-** from you with further interest and costs. The notices sent to you were returned un-served. The Hon'ble Tribunal ordered the present paper publication under substitute of service of notice.
Take notice that the above case is posted on **01-09-2022 at 10.30 a.m.** for your appearance in person or through Advocate, failing which the case will be determined in your absence.
Notice issued as per the orders of the Hon'ble Tribunal, dated **01.08.2022**
**Sd/-**
**M.VENKAT DIVAKAR, ADVOCATE**
Flat No.106, Achyutha Reddy Complex, Vidyanagar, Hyderabad-44, **Cell: 9849203661**
**Place: Hyderabad**
**Date: 10.08.2022**

BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-2
1st Floor, Treveni Complex, Palace Heights Hotel Building, Abids, Hyderabad-1
I.A. NO. 1969 OF 2021
In
O.A. No. 303 of 2020
**Between:**
**State Bank of India,** SARB-2, Chikadpally, Hyderabad
... **PETITIONER/ APPLICANT**
AND
**M/s.Naima Sales Agencies Pvt. Ltd & others**
... **RESPONDENTS/DEFENDANTS**
To,
**Smt.Dorai Suhasini,** R/o.S-1, 3rd floor, Sai Tirumala Towers, GV Reddy Colony, Alwal, Secunderabad-500010 **(Respondent No.2)**
Take notice that the Petitioner-bank has filed a petition for attachment of petition schedule property pending disposal of main OA application belongs to the Respondent No.3 Mr.Neelam Srikanth Reddy. The notices sent to you were returned un-served. The Hon'ble Tribunal ordered the present paper publication under substitute of service of notice.
Take notice that the above petition is posted on **01-09-2022 at 10.30 a.m.** for your appearance and counter, failing which the petition will be determined in your absence.
Notice issued as per the orders of the Hon'ble Tribunal, dated **01.08.2022**
**Sd/-M.VENKAT DIVAKAR, ADVOCATE**
Flat No.106, Achyutha Reddy Complex, Vidyanagar, Hyderabad-44, **Cell: 9849203661**
**Place: Hyderabad**
**Date: 10.08.2022**

IN THE COURT OF THE HON'BLE (II ADDL)VI ADDL JUNIOR CIVIL JUDGE MEDCHAL-,MALKAJGIRI, AT HASTINAPURAM
O.S. No. 611 OF 2022
Between:
PremalathaKanugnti and 2 others
....**Plaintiffs**
**AND**
AdullaVenkateshwari and another
....**Defendants**
TO
All concerned
**NOTICE**
Whereas the above named plaintiffs filed the case for Declaration of deceased Late Kanuganti Ramchandra Reddy, S/o. Kanuganti Sathi Reddy,in respect of suit schedule property against the respondents and the said case is posted to 22-08-2022 for your appearance at 10-30A.M. before the said court in person or through Advocate on the date and time mentioned above, otherwise the matter will be heard on your absence and decided exparty.
**SCHEDULE OF PROPERTY**
All that open plot.No.610, in Sy.No.16 of Aishwarya Residency, Area 244 Sq.Yards, or 203.98 Sq.Mtrs, situated at Salarjung kancha, parvathapur G.P. Ghatkesar Mandal, R.R.District, bounded by: North: Plot. No. 611, South: Plot.No.609, East: Plot. No. 613. West : 30'Wide Road.
**(By Order of the Court)**
**Sd/-V.PRABHAKAR REDDY**
**ADVOCATE**
H.No. 3-155/F6,Kondal Reddy Nivas, Budhanagar Colony, Uppal Bus depot, Hyderabad-92
**Ph.No.9848513160**

IN THE COURT OF HONORABLE JUNIOR CIVIL JUDGE RANGA REDDY DISTRICT AT: HAYATH NAGAR
O.S No. 539 of 2022
Between:
Smt. Ambatipudi Sujatha and others
AND
1. Tahsildar, Hayath Nagar Mandal, RR Dist
2. All Concerned
...**Defendants**
To,
All Concerned
Please take notice that , the plaintiffs have filed OS. NO 539 OF 2022 for declaring them as legal heirs of Late : Ambatipudi Siva Prasad of Vidyanagar, Hyderabad District And the matter is posted to 15-9-2022.
**SCHEDULE OF THE PROPERTY**
All that piece and parcel of Plot No. 113, admeasuring 267 Sq. yards in Sy.No. 201/3, situated at Sahebnagar kalan, Hayathnagar Taluq, RR dist.and bounded by : North: Plot No.112. South : 30 feet wide road. East : Plot no. 97. West : 30 feet wide road.
Therefore if anybody having any claim or objection may attend before the Honorable Principal Junior Civil Judge Ranga Reddy District At: Hayath Nagar, on 15-9-2022 at 10-30 A.M either personally or through advocate, failing which the matter may be decided in your absence.
**E. Vishwa Prasad**
**Advocate**
Flat No. 103, Sri Sai Apartment Near Post office, Amberpet, Hyderabad -13.
**Cell: 98480 74478.**
(counsel for the Plaintiffs)

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE AT : HAYATH NAGAR, RANGA REDDY DISTRICT.
O.S.NO. 546 OF 2022
Between:
Balivada Kiran Babu & another
...**Plaintiff Nos.1&2**
**And**
1. Tha Mandal Revenue Officer, Abdullapurmet, Ranga Reddy District.
2. All concerned
...**Defendants**
**NOTICE**
Please take notice that the above suit filed against you before this Hon'ble Court Vide O.S.No. 546 of 2022. The above suit is posted on 25-08-2022 for your appearance make it convenient to appear on the said date at 10.30 A.M. either in person or through your counsel failing which the matter will be decided in your absence.
**SCHEDULE OF PROPERTY**
All that Open land of Plot bearing No.101, admeasuring 300sq.yards or 250.83. Sq.Mtrs., in Sy.No. 579 and 592, situated at PEDDA AMBERPET VILLAGE, Hayath Nagar Taluk, Presently in Abdullapurmet Mandal, Ranga Reddy District., vide registered Sale Deed No. 12127 of 1984, dated 23-11-1984 registered before sub-registrar, Hyderabad East, bounded by: North : 30 Feet Road. South : Plot No.108. East : Plot No.100. West: Plot No. 102.
**// By Order of the Court//**
**Sd/- M.Prabhakar**
**Advocate**
H.No. 4-9-592/6, Vinayak Nagar Colony, Hayath Nagar, Greater Hyderabad-501505.
**Cell : 9848884442.**

IN THE COURT OF THE VII JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT,AT HYDERABAD
O.S.NO. 1944 OF 2021
**Between:**
**CANARA BANK,**
HSE Branch, Himayathnagar, HYDERABAD
....**PLAINTIFF**
**AND**
Mr.MANDAPATI RAJESH
And another
....**DEFENDANTS**
TO
1. Mr.MANDAPATI RAJESH, S/o. M.Raja Rao, R/o. Flat No.3B, Atlas Apartments, Road No.10, Opp. Rainbow Hospitals, Banjara Hills, HYDERABAD-500034, T.S.
2. VARALA VIDYA JYOTHI, D/o. Varala Narayana, R/o. H.No.8-3-191/317/49-D, Beside Nalanda College, Vengal Rao Nagar, Jubilee Hills, HYDERABAD- 500038. Telangana State.
Take notice that the Plaintiff filed Suit against you for recovery of Rs.3,77,634-00 ps. The Suit stands posted to **29-08-2022** for your appearance before the above Court and if you fail to appear in person or by an Advocate on **29-08-2022 at 10-30 A.M** before the above Court, you will be set exparte and the case will be decided in your absence.
**(BY ORDER OF THE COURT)**
**R.MANI KUMAR & P.SUSEELA**
Advocates
H.No.3-4-376/6/2, Basanth Colony, Lingampally, Kachiguda, Hyderabad-27.

IN THE COURT OF THE HON'BLE XIV ADDL. METROPOLITAN MAGISTRATE AT HAYATHNAGAR
O.S. No. 287 of 2022
Between :
**E. Surekha & another**
...**Plaintiffs**
AND
**M.R.O. Hayathnagar & Another.**
...**Defendants**
To
All Concerned
Please take notice that the above named plaintiffs have filed the above suit seeking issuance of legal heir certificate in their favour being the sole legal heirs of Late. Edulakanti Srinivas who expired on 04.05.2009.
If any person (s) have any interest in the above matter and having any kind of objection in issuance of legal heir certificate may filed their objections before the above court on 22.08.2022 at 10.30 AM in person or through an advocate, if no objection is received by the court the matter will be decided as exparte.
// BY ORDER OF THE COURT //
**MUJEEB ALI**
**Advocate.**
Office at Shop No.8, Lower Ground Floor, Sonali Mall, Abids Hyderabad - 500 001. Cell : **9912500986**

IN THE COURT OF THE IV ADDL SENIOR JUDGE RANGA REDDY DISTRICT: AT L.B.NAGAR
O.S.No. 2228 OF 2017
BETWEEN:
**Industrial Development Bank Ltd.,**
L.B.Nagar Branch, Hyderabad
Rep. By its Asst. General Manager
...**Plaintiff**
AND
**Sri. B.Gnaneshwar and another**
...**Defendants**
To,
**D2. Sri Ramulu,** S/o Nagiah, Aged: 47 years, Dec: CPE (Sew), HMWS & SB, R/o 9-2/3/7/12, Road No.6, Near Church, Ashok Nagar Colony, Boduppal, Hyderabad-500092.
Please take notice that the above suit filed against you for recovery of money is posted to 16.08.2022 for your appearance at 10.30 A.M. You can appear either in person or through an advocate before the said court on the said date, failing which, the matter will be decided ex-parte.
(By Court Order)
**Sd/- SRINIVAS CHITTURU**
**Advocate,**
3-4-533, Barkatpura, Hyderabad-500027
Counsel for Plaintiff

**SUMMONS NOTICE**
BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATIOR, R R DIST., AT: SONY COMPLEX, PRASHANTHNAGAR, KUKATPALLY, HYDERABAD
PRESENT: G. STHITA PRAJNA, MBA, LL.M.,
DISPUTE NO: 02 OF 2022
BETWEEN:
Kingiri Sairaj Chit Fund Pvt. Ltd., Katedhan Branch. Rep by it's: FOREMEN
....**DISPUTANT**
VERSUS
1. **Mr. Inder Raj Jamalpur,** S/o. Ramji, Aged about 34 yrs, R/o. H.No.4-6-238, Ganesh Temple Backside, Old M C H Ward Office lane, Isamlya Bazar, Koti, Hyd-
2. **Mr. K.Venakateshwarlu,** S/o. Ramulu, Aged about 44 yrs, R/o. H.No. 2-4-123/1/36, Swaroop Nagar Colony, Near Venkateshwara Temple, Uppal, Hyd-
3. **Mr. K.Satyanarayana,** S/o. Ambaji, Aged about 52 yrs, R/o. H.No.2-8-89, Gandhinagar, Near Singar Base, Narayanpet-509210
4. **Mr.J.Pramod Raj,** S/o. Ramji, Aged about 37 Yrs, R/o. H.No.4-6-269, Ganesh Temple Backside, Old M C H Ward Office lane, Isamlya Bazar, Koti, Hyd-
5. **Mrs. J.Anjali Raj,** W/o. Inder Raj Jamalpur, Aged about 31 yrs, R/o. H.No.4-6-238, Ganesh Temple Backside, Old M C H Ward Office lane, Isamlya Bazar, Koti, Hyd- .....**OPPONENTS**
Whereas the above named petitioner has made an application for reference of dispute with regard to non-payment of subscription U/s 32 of Chit Fund Act, 1982 and Demand for consolidated payment of future subscriptions with interest U/s 33 of Chit Fund Act 1982 for the chit Series CLT01KK, Ticket No.39 which was sanctioned bearing Previous sanction Order No: 756/2018, date 10-01-2019 to be examined under the provisions of section 64 of chit Funds Act 1982.
As on the date of filing disputed claim is Rs. 2,57,684/- you are hereby directed to appear before DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATIOR, R R DIST., Soni Complex, IInd Floor, Prashanthnagar, Near Godrej Godown, Kukatpally, Hyderabad ( R R District), in person duly on Date: 23-08-2022 at 11.00 A.M. in to show cause why the application should not be complied with that we may cause for to be done.
Please take notice that if no appearance is made on the above mentioned date and time and n o counter is filed. The case will be disposed on its merits as exparte.
Given under my hand seal of this office on this 10TH day of May - 2022.
//BY ORDER OF THE APPELLATE AUTHORITY//
**DEPUYT REGISTRAR OF CHITS / ARBITRATIOR**
**RANGA REDDY DISTRICT**

**SUMMONS NOTICE**
BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATIOR, R R DIST., AT: SONY COMPLEX, PRASHANTHNAGAR, KUKATPALLY, HYDERABAD
PRESENT: P.SUBBA RAO, B.S.C, LL.B.,
DISPUTE NO: 307 OF 2021
BETWEEN:
Kingiri Sairaj Chit Fund Pvt. Ltd., Katedhan Branch, Rep by it's: FOREMEN
....**DISPUTANT**
VERSUS
1. **Mr. Pedaprolu Koteshwar Rao,** S/o. P. Rama Brahmam, Aged about 61 yrs, R/o. Flot No.112, 1st Floor, KKR Enclave Apartment, Kanthareddy Colony, Beside spencers, Attapur, Hyderabad-48.
2. **Mr.K.Srinivasa Sharma,** S/o. Kasula Raghu Rama Sharma, Aged about 49 yrs, R/o. H.No.13-1-117/a/2/1/1, Seetaram Bagh, New Indira Nagar, Asif Nagar, Karwan, Hyderabad-500001.
3. **Mr. H. Jayaram,** S/o. Anand Rao, Aged about 37 yrs, R/o. Plot No.23, 1st Floor, Raghavendra Nagar, Kalyanapuri Colony, Uppal, Hyderabad-500039.
4. **Mr. MD. Iqbal Pasha,** S/o. Shaik Hussain, Aged about 56 Yrs, R/o. H. No. 2-2-72/43A, Turab Nagar, Ambarpet, Hyderabad-500013. ....**OPPONENTS**
Whereas the above named petitioner has made an application for reference of dispute with regard to non-payment of subscription U/s 32 of Chit Fund Act, 1982 and Demand for consolidated payment of future subscriptions with interest U/s 33 of Chit Fund Act 1982 for the chit Series CST01BK, Ticket No.11 which was sanctioned bearing Previous sanction Order No: 17/2019, date 10-01-2019 to be examined under the provisions of section 64 of chit Funds Act 1982.
As on the date of filing disputed claim is Rs.1,74,151/- you are hereby directed to appear before DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATIOR, R R DIST., Soni Complex, IInd Floor, Prashanthnagar, Near Godrej Godown, Kukatpally, Hyderabad ( R R District), in person duly on Date:23-08-2022 at 11.00 A.M. in to show cause why the application should not be complied with that we may cause for to be done.
Please take notice that if no appearance is made on the above mentioned date and time and n o counter is filed. The case will be disposed on its merits as exparte.
Given under my hand seal of this office on this 10th day of MAY - 2022.
//BY ORDER OF THE APPELLATE AUTHORITY//
**DEPUYT REGISTRAR OF CHITS / ARBITRATIOR**
**RANGA REDDY DISTRICT**

**SUMMONS NOTICE**
BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATIOR, R R DIST., AT: SONY COMPLEX, PRASHANTHNAGAR, KUKATPALLY, HYDERABAD
PRESENT: G. STHITA PRAJNA, MBA, LL.M.,
DISPUTE NO: 01 OF 2021
BETWEEN:
Kingiri Sairaj Chit Fund Pvt. Ltd., Katedhan Branch, Rep by it's: FOREMEN
....**DISPUTANT**
VERSUS
1. **Mr. Vemulapalli Sai Kumar,** S/o. Bhmeshwar rao, Aged about 25 yrs, R/o. H.No.1-9-162/163, Raju Apartment, 3rd Floor, Ramalayam street, Ram Nagar, Hyd-500020.
2. **Mr. M.Raghavendra,** S/o. M.Jagan Mohan, Aged about 27 yrs, R/o. Plot No.37, Vikas concept Lane, Peerzaziguda, Uppal, Hyd-500039.
3. **Mr. B.Chaitanya,** S/o. Sadhanand Rao, Aged about 26 yrs, R/o. Plot No.50, Vishnupuri Colony, Near Dargah Peerzaziguda, Uppal, Hyd-500039.
4. **Mrs. V.Sunitha,** D/o. Krishna Rao, Aged about 22 Yrs, R/o. H.No.1-9-162/163, Raju Apartment, 3rd Floor, Ramalayam street, Ram Nagar, Hyd-500020.
.....**OPPONENTS**
Whereas the above named petitioner has made an application for reference of dispute with regard to non-payment of subscription U/s 32 of Chit Fund Act, 1982 and Demand for consolidated payment of future subscriptions with interest U/s 33 of Chit Fund Act 1982 for the chit Series CST01BK, Ticket No.12 which was sanctioned bearing Previous sanction Order No: 17/2019, date 10-01-2019 to be examined under the provisions of section 64 of chit Funds Act 1982.
As on the date of filing disputed claim is Rs.51,435/- you are hereby directed to appear before DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATIOR, R R DIST., Soni Complex, IInd Floor, Prashanthnagar, Near Godrej Godown, Kukatpally, Hyderabad (R R District), in person duly on Date: 23-08-2022at 11.00 A.M. in to show cause why the application should not be complied with that we may cause for to be done.
Please take notice that if no appearance is made on the above mentioned date and time and n o counter is filed. The case will be disposed on its merits as exparte.
Given under my hand seal of this office on this 10TH day of May- 2022.
//BY ORDER OF THE APPELLATE AUTHORITY//
**DEPUYT REGISTRAR OF CHITS / ARBITRATIOR**
**RANGA REDDY DISTRICT**

# ఘనంగా భారత స్వాతంత్ర్య వజ్రోత్సవ వేడుకలు


జెండాల పంపిణీ చేస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ, హయ్యత్ హుస్సేన్, అజిత్‌రెడ్డి


జెండాల పంపిణీలో ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, కార్పొరేటర్ పవన్‌కుమార్, సురేందర్‌రెడ్డి


ఫ్రీడమ్ రన్‌ను నిర్వహిస్తున్న డిసి జయంత్, మధుసూదన్‌రెడ్డి తదితరులు


జాతీయ జెండాలను పంపిణీ చేస్తున్న దామోదర్, భూమేష్ తదితరులు


చంపాపేటలో ర్యాలీలో పాల్గొన్న రఘుమారెడ్డి


ఫ్రీడమ్ రన్‌ను నిర్వహిస్తున్న కొసికె ఐలయ్య, రమావత్ కళ్యాణ్‌నాయక్ తదితరులు


జాతీయ జెండాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి తదితరులు


జాతీయ జెండాలను పంపిణీ చేస్తున్న చింతల రవికుమార్ తదితరులు

**ఉప్పల్, మలక్‌పేట, తుర్కయాంజల్, వనస్థలిపురం, హయత్‌నగర్, ఎల్.బి.నగర్, తార్నాక, సైదాబాద్, ఆగస్టు 11 ప్రభాతవార్త :** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న స్వతంత్ర వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం ఉప్పల్ డిసి అరుణకుమారి ఆధ్వర్యంలో సర్కిల్ కార్యాలయం నుంచి 2కె రన్ నిర్వహించిన ఈ కార్యక్రమానికి కార్పొరేటర్లు బన్నాల గీత, బండారు శ్రీవాణి, ఎం.రజితరెడ్డి, డిసి అరుణకుమారి, శానిటేషన్ డిఇ చందన, ప్రాజెక్ట్ అధికారి రమాదేవి, సిఐ గోవిందరెడ్డి, ఎస్ఐ మైబెల్లి, డిఇ నిఖిల్‌రెడ్డి, ఎఇ రాజ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ 75 ఏళ్ల స్వాతంత్ర్య సంబరాల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా వజ్రోత్సవ వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

**లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో...** ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో రాచకొండ పోలీసుల ఆధ్వర్యంలో స్వతంత్ర వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం ఫ్రీడం రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి డిసిపి రక్షితమూర్తి, ఎసిపి నరేష్‌రెడ్డి, సిఐ గోవింద రెడ్డి, డిఐ నర్సింగ్‌రావు, ఉప్పల్ ట్రాఫిక్ అడిషనల్ ఇన్‌స్పెక్టర్ మక్బూల్‌జానీ, ఎస్ఐ వెంకట్ రెడ్డి, రమేష్, మధుసూధన్, సుధాకర్‌రెడ్డి, నెహ్రు, వెంకటేష్, ఈస్తెర్‌రాణి, ఇతర సిబ్బంది ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి ఫ్రీడం రన్ ర్యాలీ నిర్వహించారు.

**మలక్‌పేటలో...** మలక్‌పేట నియోజకవర్గంలో స్వాతంత్ర్య వజ్రోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. టిఆర్ఎస్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ, మలక్‌పేట నియోజకవర్గ టిఆర్ఎస్ ఇంఛార్జి ఆజంఅలీ జాతీయ జెండాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ భూమేష్, డివిజన్ అధ్యక్షుడు హయ్యత్ హుస్సేన్ హబీబ్, కామేష్, రాముయాదవ్, సల్మాన్‌ఖాన్, నాయకులు తీగల అజిత్‌రెడ్డి, గౌర శశిధర్ తదదితరులు పాల్గొన్నారు.

**మలక్‌పేట మార్కెట్‌లో...** మహబూబ్ మాన్షన్ మార్కెట్‌లో ఎస్‌జిఎస్ దామోదర్, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ భూమేష్‌తో కలిసి జాతీయజెండాలను పంపిణి చేసారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్-3 కార్యదర్శి రవీందర్‌రెడ్డి, గ్రేడ్ -1 కార్యదర్శి రవికుమార్, డైరెక్టర్ నరేష్, నూలి శ్రీధర్‌రావు, తుమ్మలపల్లి రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మూసారాంబాగ్‌లో...** డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి తన నివాసంపై జాతీయ జెండాను ఎగురవేసారు. అనంతరం కాలనీవాసులతో కలసి పాదయాత్ర నిర్వహించి ప్రతి ఇంటిపై జాతీయ జెండాలుంచి దేశభక్తిని చాటాలన్నారు. అదే విధంగా మూసారాంబాగ్‌నుండి దిల్‌సుక్ నగర్‌వరకు డిసి జయంత్, బొక్క మధుసూదన్‌రెడ్డిలు ఫ్రీడమ్ రన్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో గోవింద్‌రెడ్డి, రమేష్, ముజీబ్, శ్రీను, గణేష్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

**సాయి చైతన్య కళాశాల ఆధ్వర్యంలో...** దిల్‌సుక్‌నగర్ సాయి చైతన్య కళాశాల ప్రిన్సిపల్ సురేష్ ఆధ్వర్యంలో వజ్రోత్సవ వేడుకల సందర్భంగా తమ విద్యార్థులచే జాతీయ జెండాలతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించామని తెలిపారు.

**తుర్కయంజాల్‌లో...** స్వతంత్ర వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా తుర్కయాంజల్ చౌరస్తానుంచి ఇంజపూర్ వరకు 10కే ఫ్రీడమ్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిల్ ఫ్లోర్ లీడర్లు, కోసికే ఐలయ్య, రమావత్ కళ్యాణ్ నాయక్ మాట్లాడుతూ స్వాతంత్రం సిద్ధించి 75 సంవత్సరాలవుతున్న సందర్భంగా వజ్రోత్సవాలను జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కొత్త కుర్మా మంగమ్మ శివకుమార్, నక్క శివలింగంగౌడ్, కోండ్రు మల్లేష్, నాయకులు కుంట గోపాల్ రెడ్డి, అధికారులు జంగయ్య, ప్రశాంత్ గౌడ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

**బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలో...** దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఆగస్టు 13 నుండి 15 వరకు ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చిన సందర్భంగా ఈ రోజు బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలో కాలనీలలో డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి జాతీయ జెండాలను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో రాజారావు, కాలనీ అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సాయిబాబు, రఘురాం నేత, నరసింహారెడ్డి, శ్రీధర్ రావు, ఆదిలక్ష్మి, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

**వనస్థలిపురంలో...** వనస్థలిపురం ఫేస్ 2 హుడా కాలనీలో వజ్రాత్సవ వేడుకల్లో భాగంగా డివిజన్ తెరాస అధ్యక్షులు చింతల రవి కుమార్ గుప్తా ఆధ్వర్యంలో ఇంటింటికి జెండాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఏ.బాల్‌రెడ్డి, ఎస్.కామేశ్వరరావు, ఆనంద్‌రాజ్, సతీష్‌గుప్తా, రాములు, శ్రీనివాస్‌రావు, చంద్రశేఖర్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

**పెద్దఅంబర్‌పేటలో...** వజ్రోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటిమీద మువ్వన్నెల జెండాను ఎగుర వేయాలని పెద్దఅంబర్‌పేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ చెవుల స్వప్న, 9వ వార్డు కౌన్సిలర్ చల్లూరి మురళీధర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా పెద్దఅంబర్‌పేటలో జేసీబీ షోరూం నుంచి అంబేడ్కర్ చౌరస్తావరకు 2కె రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతిఒక్కరు ఇంటిపై జెండాను ఏర్పాటుచేసుకుని హర్‌ఘర్‌మే తిరంగా నినాదాన్ని అమలు చేయాలన్నారు. అనంతరం 9వ వార్డు పరిధిలోని ఇంటింటికీ జాతీయ జెండాలను పంపిణీ చేశారు. హయత్‌నగర్ పోలీసుల ఆధ్వర్యంలో హయత్‌నగర్ మండల రెవెన్యూ కార్యాలయం నుంచి వర్డ్ అండ్ డీడ్ పాఠశాల వరకు 2కె రన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, కమిషనర్ రామాంజులరెడ్డి, కౌన్సిలర్లు జయశ్రీరాజు, సిద్ధంకి కృష్ణారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, అనుపమ, రోహిణి, పరశురాం, డీఈఈ అశోక్‌కుమార్, సాయికుటీర్ అధ్యక్షుడు మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.

**బండ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో...** బిజేపీ చేపట్టిన వజ్రోత్సవ కార్యక్రమంలో భాగంగా బిజేపీ నాయకులు బండచంద్రారెడ్డి ఆధ్వర్యంలో తార్నాకచౌరస్తానుంచి అమీర్‌పేట్‌వరకు మువ్వన్నెల జెండాలతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోది. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపు మేరకు చేపట్టిన ఘర్ ఘర్‌కి తిరంగా కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనిత, డివిజన్ అధ్యక్షులు రాముపర్మ, బండశివారెడ్డి, టెంపుల్ సాయి, గోవర్ధన్, ప్రభుకుమార్, సాయిరాం, కిరణ్‌కుమార్ గౌడ్, విజయ్, కరుణాకర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

**చంపాపేట, ఐఎస్ సదన్‌లలో...** స్వాతంత్ర్య వజ్రోత్సవాల్లో భాగంగా చంపాపేట డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షుడు ముదుపు రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఫ్రీడం రన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు నల్ల రఘుమారెడ్డి, పోలీసులు, నాయకులు పాల్గొన్నారు.

**జాతీయ జండాల పంపిణీ...** యాకుత్‌పుర నియోజకవర్గం టిఆర్ఎస్ ఇంఛార్జి సామ సుందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సామ స్వప్నల ఆధ్వర్యంలో ఐఎస్ సదన్ డివిజన్‌లోని సింగరేణి కాలనీలో జాతీయ జండాలు పంపిణీ చేశారు.

**కొత్తపేట డివిజన్‌లో...** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వాతంత్ర వజ్రోత్సవాల సందర్భంగా కొత్తపేట డివిజన్ టిఆర్ఎస్ మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.విజయగౌడ్ ఆధ్వర్యంలో జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా పాల్గొని స్వాతంత్ర సంబురాల భాగంగా విద్యార్థులు, జిహెచ్ఎంసి సిబ్బందితో ర్యాలీ నిర్వహించి మారుతీనగర్‌లో జాతీయ జెండాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు వరుణ్, సంపత్, కుమార్, పద్మ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**కొత్తపేటలో...** కొత్తపేట డివిజన్ స్నేహపురికాలనీలో ఘర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా స్నేహపురికాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు అనంతుల సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్‌గుప్త, కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ జాతీయ జెండాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మధుసూధన్‌రెడ్డి, కృష్ణమూర్తి, అజిత్ రెడ్డి, జ్ఞానకుమార్, సత్యనారాయణ రామకృష్ణ, హేమసురేందర్, ప్రసన్నక్రిష్ణ, నాయకులు సుందర్‌నారాయణ, కొత్త తిరుమల్, శరణ్, తదితర కాలనీ వాసులు పాల్గొన్నారు.

**చైతన్యపురిలో...** ఇంటింటా జాతీయ పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్ర భారత కీర్తిని దశదిశల చాటాలని చైతన్యపురి డివిజన్ టిఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో చైతన్యపురి డివిజన్‌లో జాతీయ జెండాలు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో తెరాస నాయకులు కృష్ణ, జలంధర్, సంతోష్ యాదవ్, కిరణ్, విజయ్, రమేష్, నరేష్, శంకర్, రాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

**గడ్డిఅన్నారంలో...** వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించాలని సిఎం కేసీఆర్, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పిలుపుమేరకు వాడవాడలా జాతీయ జెండాలను ఎగరవేయాలని గడ్డిఅన్నారం డివిజన్ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జక్కుల శ్రీశైలంయాదవ్ కోరారు. ఈ మేరకు డివిజన్‌లోని పలు కాలనీలలో ఇంటిఇంటికి జాతీయ జెండా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్‌కుమార్, రమేష్‌ముదిరాజ్, రవిచారి, నరసింహారావు, రవీందర్ రెడ్డి, ప్రదీప్‌గౌడ్, కృష్ణ, మహిళా నాయకులు శైలజ, విజయలక్ష్మి, పరమేశ్వరి, అరుంధతి, నాగమణి, లక్ష్మి, హసీనా, ఉష తదితరులు పాల్గొన్నారు.


ఫ్రీడం రన్‌లో పాల్గొన్న డిసిపి రక్షితమూర్తి, ఎసిపి నరేష్‌రెడ్డి, సిఐ గోవిందరెడ్డి తదితరులు


ఫ్రీడం రన్‌లో పాల్గొన్న కార్పొరేటర్లు బన్నాల గీత, శ్రీవాణి, రజితరెడ్డి, డిసి, అధికారులు


జాతీయ జెండా ఎగుర వేసిన భాగ్యలక్ష్మి



ర్యాలీ నిర్వహిస్తున్న సాయిచైతన్య విద్యార్థులు


బైక్ ర్యాలీతో బండ చంద్రారెడ్డి,బిజేపీ శ్రేణులు


జెండాల పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి


చిన్నారులతో సామ సుందర్‌రెడ్డి, స్వప్నలు


జాతీయ జెండాలను అందజేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి


జాతీయ జెండాలను అందజేస్తున్న విజయగౌడ్


జాతీయ జెండాలను అందజేస్తున్న శ్రీశైలంయాదవ్, భవానిప్రవీణ్ కుమార్

## ఫుట్ ఓవర్ బ్రిడ్జి ప్రారంభం : ఎమ్మెల్యే మైనంపల్లి

**నేరెడ్‌మెట్ ఆగస్టు 11 ప్రభాతవార్త:** గ్రేటర్ అభివృద్ధికి సిఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని మేయర్ గద్వాల విజయలక్ష్మి పేర్కొన్నారు. గురువారం మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని నేరెడ్‌మెట్ చౌరస్తాలో రూ. 3కోట్ల 50లక్షలతో ఏర్పాటుచేసిన ఫుట్‌ఓవర్‌బ్రిడ్జిని ఎమ్మెల్యే మైనంపల్లిహన్మంత్‌రావు, కార్పొరేటర్లతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేరెడ్‌మెట్‌సర్కిల్ రద్దీ ప్రాంతమవ్వడంతో పాదాచారులు ఇబ్బందులు ఎదుర్కోకుండా బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. నగరంలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం అవసరమైన చోట బ్రిడ్జిలను ఏర్పాటు చేస్తామన్నారు. గ్రేటర్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు నూతన ప్రణాళికలు చేపట్టడం జరుగుతుందనా న్నరు. ఈ కార్యక్రమ ంలో డిప్యూటీమేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి,కార్పొరేటర్ మీనాఉపేందర్ రెడ్డి, సునితరాముయాదవ్, సబితకిశోర్‌గౌడ్, ప్రేమ్‌కుమార్, జితేంద్రనాథ్, జోనల్‌కమీషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఇ అనిల్, డిప్యూటీ కమీషనర్ రాజు, ఈఈ లక్ష్మణ్, డీఇ మహేష్, ఏఇ సృజన,నాయకులు కొత్తపల్లి ఉపేందర్‌రెడ్డి,బద్దం పరుశరామ్ రెడ్డి, జిఎన్‌వి సతీష్ కుమార్, రాము యాదవ్, మహత్య వర్ధన్, గోకుల్ కుమార్, చిందం శ్రీనివాస్, పిట్ల శ్రీనివాస్, చెన్నారెడ్డి, మహేష్, రమేష్, రాజు, సంతోష్, రాందాస్, సత్తయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


మేయర్ విజయలక్ష్మితో కలసి ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు తదితరులు

## నాటి స్వాతంత్ర్య పోరాటంలో ముస్లిం నేతల పాత్రల గొప్పది : టిపిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి

**సరూర్‌నగర్, ఆగస్టు 11 ప్రభాతవార్త:** దేశ స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్‌కు చెందిన నాటి ముస్లిం నేతల పాత్ర చాలా గొప్పదని టిపిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి కొనియాడారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా ఎఐసిసి పిలుపు మేరకు టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఆజాదీ కా గౌరవ్ పాదయాత్రలు గురువారం మహేశ్వరంనియోజకవర్గంలోని జల్‌పల్లి మున్సిపాలిటీలో జరిగాయి. ఈ సందర్భంగా రంగారెడ్డి డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ మైనారిటీ నేతల ఆధ్వర్యంలో జరిగిన పాదయాత్రలకు హాజరైన అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ నాటి స్వాతంత్ర్య ఉద్యమంలో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్, జాకీర్ హుస్సేన్, ఖాన్ గఫార్ ఖాన్ లాంటి గొప్ప నేతలు చురుకైన పాత్ర పోషించారని అన్నారు. నాడు కుల, మతాలకతీతంగా స్వాతంత్ర్యం సాధించుకుంటే నేడు బిజెపి ఆధ్వర్యంలో మోడిప్రభుత్వం దేశంలో ప్రజల మధ్య మతాల చిచ్చు పెడుతున్నదని ఆరోపించారు. దేశంలో అన్ని మతాలు, వర్గాల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రంగారెడ్డి జడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, చిగిరింత నర్సింహారెడ్డి, జల్‌పల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు సమద్ బిన్‌సిద్దిఖీ, యూసుఫ్ ఖాద్రి, అబ్దుల్‌బారి,అహ్మద్‌బామ్, రియాజ్‌ఖాన్, బడంగ్‌పేట్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెద్దబావి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆజాదీ కా గౌరవ్ పాదయాత్రల్లో ప్రసంగిస్తున్న యెల్మేటి అమరేందర్‌రెడ్డి: పక్కన చల్లా నర్సింహారెడ్డి తదితరులు

## కనుల పండువగా పోచమ్మ విగ్రహాల ప్రతిష్టాపన


విగ్రహాల ఊరేగింపులో పాల్గొన్న తీగల కృష్ణారెడ్డి

**సరూర్‌నగర్, ఆగస్టు 11 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలో పునర్నిర్మాణానికి నోచుకున్న మీర్‌పేట్‌లోని చారిత్రక శ్రీ నల్ల పోచమ్మ, ఎర్ర పోచమ్మ ఆలయంలో ప్రతిష్ఠించనున్న అమ్మవార్ల విగ్రహాల ఊరేగింపు గురువారం కనుల పండువగా జరిగింది. మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అన్ని పార్టీల నాయకులు సమిష్టిగా పని చేసి దాతల సహకారంతో పోచమ్మ ఆలయాలను నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపనోత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవార్ల విగ్రహాలను శాస్త్రోక్తంగా పుర వీధుల్లో కోలాహలంగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్‌రెడ్డి, పల్లె పాండుగౌడ్, తీగల సాయినాథ్‌రెడ్డి, ఉయ్యాల నవీన్‌గౌడ్, కీసర శ్రీనివాస్‌రెడ్డి,ఎరుకల రాజుగౌడ్, బొజ్జ పరమేష్, ఎరుకల రవిగౌడ్, కీసర హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మీర్‌పేట్ కార్పొరేషన్‌లో ఫ్రీడం ర్యాలీ


ఫ్రీడమ్ ర్యాలీని నిర్వహిస్తున్న కమిషనర్ నాగేశ్వర్‌రావు

**సరూర్‌నగర్, ఆగస్టు 11 ప్రభాతవార్త:** స్వాతంత్ర్య వజ్రోత్సవాల సందర్భంగా మీర్‌పేట్ మున్సిపల్ కమీషనర్ చిట్టి నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఫ్రీడమ్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ ముదావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, మీర్‌పేట్ ఇన్స్‌పెక్టర్ మద్ది మహేందర్‌రెడ్డి, కార్పొరేషన్ డిఇఇ గోపినాథ్, ఎఇఇ శ్రీనివాసులు, ఆర్‌ఓ అంజన్‌రెడ్డి, టిపిఓ దేవానంద్, పలువురు కార్పొరేటర్లు, నాయకులు జాతీయ జెండాలను చేతబట్టి కార్పొరేషన్ కార్యాలయం నుండి మీర్‌పేట్ పాత గ్రామంలోని చారిత్రక బురుజు వరకు ప్రదర్శన జరిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సిద్దాల బీరప్ప, కొండ్రు గౌరీ శంకర్, ఎనుగుల అనిల్ యాదవ్, గజ్జెల రాంచందర్, కో-ఆప్షన్ సభ్యులు ఎం.ఎ.రజాక్, జఠావత్ రవినాయక్, జంగయ్య గౌడ్,నాయకులు జిల్లెల ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేషన్ సిబ్బంది, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆర్పీలు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో జాతీయ జెండాల పంపిణీ


మున్సిపల్ మైదానం వద్ద కార్పొరేటర్లతో కలిసి ర్యాలీలో పాల్గొన్న మేయర్ పారిజాత తదితరులు

**సరూర్‌నగర్, ఆగస్టు 11 ప్రభాతవార్త:** స్వాతంత్ర్య వజ్రోత్సవ సంబరాల్లో భాగంగా గురువారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని పలు డివిజన్లలో పర్యటించిన మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ప్రజలకు ఉచితంగా జాతీయ జెండాలను పంపిణీ చేశారు. కార్పొరేటర్లు దడిగ శంకర్, రామిడి మాధురి వీరకర్ణారెడ్డి, లిక్కి మమత కృష్ణారెడ్డి, రామోజీ అమిత శ్రీశైలంచారిలతో పాటు రామిడి శూరకర్ణారెడ్డి తదితరుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు హాజరైన ఆమె త్రివర్ణ పతాకాలను ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం బడంగ్‌పేట్ దావూద్‌ఖాన్‌గూడలోని మున్సిపల్ మైదానంలో పలువురు కార్పొరేటర్లు, కార్పొరేషన్ అధికారులతో కలిసి తిరంగ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దబావి ఆనంద్‌రెడ్డి, రామిడి రాంరెడ్డి, సూర్ణగంటి అర్జున్, పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, తోట శ్రీధర్‌రెడ్డి, గూడెపు ఇంద్రసేన, అధికారులు చంద్రశేఖర్‌రెడ్డి, రాంప్రసాద్ రెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో కాషాయం జండా ఎగర వేయడం ఖాయం : పిట్ట


మాజీ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి, బిజెపి కన్వీనర్ ఉపేందర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, ఆగస్టు 11 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో కాషాయం జెండా ఎగరవేయడం ఖాయమని రంగారెడ్డి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి పిట్ట ఉపేందర్ రెడ్డి పేర్కొన్నారు. మునుగోడు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి బిజెపిలో సందర్భంగా ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు బిజెపి నాయకులు గురువారం ఆయన కలిసి పుష్పగుచ్ఛని అందజేశారు. ఈ సందర్భంగా ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కుటుంబ పాలన రాక్షస పాలన కొనసాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి, మహేశ్వరం అసెంబ్లీ బిజెపి కన్వీనర్ దీరజ్‌రెడ్డి, వెంకటేష్ యాదవ్, రాములుయాదవ్, శ్రీశైలం, హరి, రమేష్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, సుదర్శన్, నర్సింహరావు, సతీష్ పాల్గొన్నారు.

## షిర్డీసాయిబాబా దర్శించుకున్న ఎమ్మెల్యే బేతి

**ఉప్పల్, ఆగస్టు 11 ప్రభాతవార్త :** ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి గురువారం షిర్డీ సాయిబాబా ఆలయాన్ని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి కుటుంబ సభ్యులతో పాటు, పలువురు పార్టీ నేతలు బాబాను దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బేతి మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గం ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని స్వామి వారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## గాయపడిన టిఆర్ఎస్ సభ్యుడు ప్రవీణ్‌కు ఎమ్మెల్యే పరామర్శ


గాయపడిన ప్రవీణ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి

**నేరెడ్‌మెట్ ఆగస్టు 11 ప్రభాతవార్త:** నేరెడ్‌మెట్ డివిజన్ యాప్రాల్‌కు చెందిన టిఆర్ఎస్ పార్టీ సభ్యుడు ప్రవీణ్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై కాళ్ళకి ఫ్యాక్చర్ అవ్వడంతో గురువారం ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు ఆయన నివాసంలో కలసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు తాము ఎల్లప్పుడు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొత్తపల్లి మీనాఉపేందర్‌రెడ్డి, మల్కాజిగిరి సర్కిల్ ఉపాధ్యక్షులు కొత్తపల్లి ఉపేందర్‌రెడ్డి, రమేష్, మహేష్, చెన్నారెడ్డి, రాజు, నవీన్, కిశోర్, శ్రీనివాస్, శోభ, రమాదేవి, విజయ, పరిమళ, ప్రమీళ, నవనీత తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల పట్ల ప్రిన్సిపాల్ అసహనం

**ఎల్.బి.నగర్, ఆగస్టు 11 ప్రభాతవార్త:** అనాథ విద్యార్థుల ను ప్రిన్సిపాల్ సుహాసిని చిన్నచిన్న కారణాలతో బయటకు వెళ్ళగొట్టడం, కొట్టడం చేస్తూ విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తోందని వి.యం.హోం పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు భీమగాని మహేశ్వర్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ తీరుపై పడిన చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ కమీషనర్ యోగితారాణి కార్యదర్శి ఆనగంటి కిషన్లకు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వి.యం. హోంలో విద్యాప్రమాణాలు పూర్తిగా పడిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. వి.యం.హోంకు 73 ఎకరాల సువిశాల స్థలముందని అనాథ పిల్లలకు కెజీ టు పిజీ ఏర్పాటు చేయాలని కోరారు. సెక్యూరిటీ వ్యవస్థ లేకపోవడం వల్ల పాఠశాల ఆవరణలోకి బయటవారు వచ్చి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని వివరించారు. హోంలో వోకేషనల్ కోర్సులు వెంటనే పునరుద్ధరించాలని కోరారు. విద్యార్థుల కోసం లక్షలరూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన జిమ్ సామాగ్రి, బెడ్స్ ఆరుబయట పడేయడం వల్ల పనికిరాకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల మానసిక సమస్యల పరిష్కారం కోసం కౌన్సిలింగ్ సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. వి.యం.హోంలో పందుల పెంపకంవల్ల పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారని, డైనింగ్‌లో సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వి.యం.హోం పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు భీమగాని మహేశ్వర్ గౌడ్, కార్యదర్శి గంధమళ్ళ రాము, ఉపాధ్యక్షుడు బుషిపాక రాజు, సహాయకార్యదర్శి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## బలరాం నగర్‌లో కరోనా బూస్టర్ డోస్

**నేరెడ్‌మెట్ ఆగస్టు 11 ప్రభాతవార్త:** 140 డివిజన్ పరిధిలోని బలరాంనగర్‌లో కరోనా బూస్టర్ డోస్ కార్యక్రమాన్ని స్థానిక కార్పొరేటర్ శ్రావణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనాను కట్టడి చేయడానికి డివిజన్ ప్రజలు తప్పకుండా బూస్టర్ డోస్‌ను వేసుకోవాలని సూచించారు. దాదాపు 200 మంది వరకు బూస్టర్ డోస్‌ను తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సభ్యులు సూరజ్ సింగ్, కిశోర్ సింగ్, విజయ్, మురళి, సతీష్, శివానంద్, సంతోష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ నల్ల చెరువు సమీపంలోని రెండవ రోజు శ్రీలక్ష్మీ హయగ్రీవ గణపతి, సరస్వతి బ్రహ్మోత్సవాలు


లక్ష్మి హయగ్రీవ, గణపతి సరస్వతి ఆలయం బ్రహ్మోత్సవాల్లో భాగంగా హోమం నిర్వహిస్తున్న సల్ల వీరారెడ్డి తదితరులు

**ఉప్పల్, ఆగస్టు 11 ప్రభాతవార్త :** ఉప్పల్ నల్ల చెరువు సమీపంలో ఉన్న శ్రీ లక్ష్మీ, హయగ్రీవ, శ్రీలక్ష్మీ గణపతి, విద్యా సరస్వతి ఆలయంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ ట్రస్ట్ చైర్మన్ సల్ల వీరారెడ్డి, సల్ల సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డప్పు వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చరణాల మధ్య అంగరంగ వైభవంగా పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా గురువారం స్థాపిత దేవతామూర్తుల విగ్రహాలకు పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ నగరంలో ఎక్కడా లేని విధంగా ఉప్పల్‌లోని తన స్వంత భూమిలో శ్రీ లక్ష్మీ, హయగ్రీవ, శ్రీలక్ష్మీ గణపతి, విద్యాసరస్వతి ఆలయం నిర్మాణం చేసినట్లు తెలిపారు. విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలతోపాటు, వివిధ పూజ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. 3రోజులపాటు ఉత్సవాలు జరుగుతాయని, ప్రతిరోజు ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

## నాదర్‌గుల్‌లో ఉచిత వైద్య శిబిరం

**సరూర్‌నగర్, ఆగస్టు 11 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 9వ డివిజన్ నాదర్‌గుల్ అశోక్‌రెడ్డి కాలనీలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ నిమ్మల సునీత శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎల్‌బినగర్ కామినేని ఆసుపత్రి వారు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బిపి, షుగర్, సాధారణ వ్యాధులతో పాటు వివిధ రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించి అవసమైన మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, కాలనీవాసులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.

## అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ : ఎన్వీఎస్ఎస్

**ఉప్పల్, ఆగస్టు 11 ప్రభాతవార్త :** అన్నాచెల్లెళ్ల అనుబంధానికి రక్షాబంధన్ ప్రతీకగా నిలుస్తుందని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం బిజెపి మహిళా మోర్చ నాయకురాలు పద్మ, జ్యోతి, అనిత తదితరులు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నేతలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ : రాగిడి


ఉప్పల్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నేత రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, ఆగస్టు 11 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో మధురా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తమ వంతు చేయూత అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వపాఠశాలలో విద్యార్థులకు ఉత్తమ బోధన అందిస్తున్న ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమన్నారు. ఉత్తమంగా రాణించిన విద్యార్థులకు చేయూత అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుధాకర్‌శెట్టి, పుప్పాల వెంకటేష్, సంజయ్‌జైన్, కరిపె సంతోష్, వినయ్, బజారు నవీన్‌గౌడ్, సాయిబాబా, భాను గౌడ్, మల్లేష్‌గుప్త, పెద్దిరెడ్డి, పవన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.